PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 257 | విజయవాడ, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00
Vol No | Vijayawada, Sunday 20 April 2025 | Rs



సమగ్రశిక్ష కృషి ప్రశంసనీయం

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల శారీరక, మానసిక, విద్యా వికాసానికి సమగ్రశిక్ష చేస్తున్న కృషి ప్రశంసనీయమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. సమగ్రశిక్ష ఏర్పాటై పాతికేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమగ్ర విద్యా ప్రమాణంలో భాగమైన ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంస్థలు, సంఘాలకు హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. ఎన్నో అవార్డులు-రివార్డులు సాధించిన సమగ్రశిక్ష టీం వర్క్‌తో మరిన్ని లక్ష్యాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునట్లు వెల్లడించారు. సమగ్రశిక్ష పాతికేళ్ల ప్రస్థానాన్ని 'మనబడి' మాసపత్రికలో చక్కగా వివరించారని పేర్కొన్నారు.

ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి పదవీ కాలం పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎమ్‌డి) కె సంతోష్‌రావు పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించిన జిఓ 29ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శనివారం విడుదల చేశారు. సంతోష్‌రావును 2023 ఏప్రిల్ 14న ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిగా నియమించిన ప్రభుత్వం రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని వెల్లడించింది. ఇప్పుడు కొత్తవారిని నియమించే వరకు ఆయననే కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వయోపరిమితి సడలించలేం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి గరిష్ట వయో పరిమితి పెంపు చేయాలని కోర్టులు ఉత్తర్వులు జారీ చేయబోవని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇది పూర్తిగా అధికారుల పరిధిలోని అంశమని పేర్కొంది. ఒకసారి వయోపరిమితి పెంచాక మళ్లీ సడలించబోమన్న విద్యాశాఖ వాదనను సమర్థించింది. సర్వశిక్ష అభియాన్ పథకంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆర్ట్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీ సమయంలో గరిష్ట వయో పరిమితిని సడలింపునకు ఉత్తర్వులు ఇవ్వాలనే పిటిషన్లను డిస్మిస్ చేస్తూ జస్టిస్ కె మన్మథరావు తీర్పు చెప్పారు. గరిష్ట వయో పరిమితి సడలింపు నిమిత్తం 2012 జనవరి 2న వెలువడిన జిఓ ఒకటికి అనుగుణంగా కడప జిల్లాలోని ఆ పోస్టుల భర్తీకి గరిష్ట వయో పరిమితిని సడలింపు ఉత్తర్వులు ఇవ్వాలని వినయ్‌బాబు సహా నలుగురు వేసిన పిటిషన్లను కొట్టివేశారు. ఇప్పటికే అభ్యర్థుల వయో పరిమితి పెంపుదల జరిగిందని విద్యాశాఖ వాదనను సమర్థించింది.

న్యాయవాదిపై దాడికి ఖండన

ప్రజాశక్తి-అమరావతి

భారత న్యాయవాద మండలి (బిసిఐ) వైస్ ఛైర్మన్, సీనియర్ న్యాయవాది వైఆర్ సదాశివరెడ్డిపై ఈ నెల 16న బెంగళూరులోని సొంత కార్యాలయంలో దాడి జరగడాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఖండించింది. నిందితుల్ని అరెస్టు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథరెడ్డి, వైస్ ఛైర్మన్ సిరిపురపు కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం కూడా సదాశివరెడ్డిపై దాడిని ఖండిస్తున్నట్లు, దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ సంఘం అధ్యక్షులు కలిగినీడి చిదంబరం ఆధ్వర్యంలోని కార్యవర్గం పోలీసులను కోరింది.

కార్పొరేట్ శక్తులకు రైల్వేలు

- ప్రయివేటీకరణను ఆపండి
- భద్రతా ప్రమాణాలు చేపట్టాలి
- సిఐటియు జాతీయ అధ్యక్షులు హేమలత



సదస్సులో మాట్లాడుతున్న హేమలత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని, భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్ర సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల సంపదైన రైల్వేను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందన్నారు. వారి ప్రయోజనాల కోసం ప్రయివేటీకరణ విధానాలను దూకుడుగా అమలుపరుస్తోందని విమర్శించారు. రైల్వేలో అత్యంత కీలక విభాగాలైన సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, రైల్వే ట్రాక్ మెయింటినెన్స్, ఇంజినీరింగ్, ఆపరేటింగ్, మెకానికల్ తదితర వాటిని ప్రయివేటీకరణ చేసిందన్నారు. ఏడేళ్ల క్రితమే ప్రమాదాల నివారణకు రైల్వే టాస్క్‌ఫోర్స్ కమిటీ, కాగ్, రైల్వే సేఫ్టీ కమిటీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తదితర కమిటీలు అనేక సూచనలతో నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాయని, ప్రభుత్వం వాటిని పెడచెవిన పెట్టిందని అన్నారు. రైల్వేలో భద్రతా చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సక్రమంగా నిధులు కేటాయించడం లేదన్నారు. ఈ కారణాల రీత్యా ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. 2000-01లో 15,14,816 మంది ఉద్యోగులు పనిచేయగా, 2024 మార్చి 31 నాటికి 12,52,200 మంది పనిచేస్తున్నారన్నారు. దీనిని బట్టే 2,62,616 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్థమవుతోందన్నారు. ప్రతిఏటా 20 వేల మంది రైల్వే ఉద్యోగులు రిటైర్ అవుతున్నా ఆ తీరున పోస్టులు భర్తీ కావడం లేదన్నారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ పర్స్ కుమార్ మాట్లాడుతూ... మెయింటినెన్స్ పనులన్నింటినీ ప్రయివేటీ కరణ చేయటంతో నాణ్యత తగ్గిపోతోందన్నారు. అధికారుల అజమాయిషీ తగ్గి ప్రయివేటు యజమానుల అజమాయిషీ పెరిగిందన్నారు. రైలు ప్రమాదాలు పెరగడానికి గల కారణాలను వివరించారు. రైల్వే సిబ్బందిపై ఉన్న పనిభారాన్ని తెలియజేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. రైల్వేలోని అన్ని ఖాళీలనూ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే పరిరక్షణ ఉద్యమంలో భాగంగా మే 15న అన్ని జిల్లాల్లో సదస్సులు జరపాలని, జూన్ 1 నుంచి 9 వరకు ప్రయాణికులు, ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. జూన్ 10న రైల్వే స్టేషన్‌ల్లో ధర్నాలు జరపాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించినట్టు వెల్లడించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైల్వే యూనియన్ రాష్ట్ర బాధ్యులు వి.ఉమామహేశ్వరరావు, ఎల్ఆర్ఎస్ఎ నాయకులు చోబే, బోలేనాథ్, చిన్నోడు, స్టేషన్ మాస్టర్ అసోసియేషన్ నాయకులు మూర్తి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వివి.నరసింహులు, నాయకులు అవతారం, శ్రీనివాస్, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి కుమార్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

త్వరలో కానిస్టేబుల్ నియామకాలు పూర్తి

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలో శాంతి భద్రతలపై జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో ఆమె శనివారం సమీక్ష నిర్వహించారు. ఆరు వేల పోస్టులకు తొలి విడత రాతపరీక్షతోపాటు దేహదారుఢ్య పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయని, తుది విడత రాత పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉందని చెప్పారు. సిబ్బంది కొరత వాస్తవమేనని, క్షేత్రస్థాయి నుంచి డిఎస్‌పి స్థాయి వరకు త్వరలోనే ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. గత పది నెలల కాలంలో పోక్సో కేసుల్లో 30 మందికి శిక్షలు పడ్డాయన్నారు. సచివాలయాల్లోని మహిళా పోలీసుల సేవలను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై అధ్యయనం జరుగుతోందని, వారిలో ఉన్నత చదువులు చదివిన వారూ ఉన్నారని, పోలీసు స్టేషన్లలో వారిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని, శక్తి టీమ్‌ల ద్వారా మహిళలకు రక్షణ కల్పించాలని చెప్పారు. ప్రకాశం జిల్లాలో గత మూడు నెలల్లో సైబర్ నేరాలేమీ నమోదు కాలేదన్నారు. కొత్తగా పది పోలీసు స్టేషన్లు ఏర్పాటు ప్రతిపాదన ఉందని, జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసిపి నాయకులు పోలీసులపై దూకుడుగా వ్యవహరిస్తే చర్యకు ప్రతి చర్య ఉంటుందని తెలిపారు.

టెండర్ల దశలో జోక్యం చేసుకోలేం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో 108, 104 సేవలకు చెందిన టెండర్ల వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తెలిపింది. టెండర్ల దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని గుర్తు చేసింది. ఈ వ్యవహారంపై ఒక విద్యార్థి పిల్ దాఖలు చేయడం వెనుక సందేహాలున్నాయని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. పిల్‌ను డిస్మిస్ చేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. గత జనవరి 31న జారీ చేసిన టెండర్ రూల్స్‌ను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన విద్యార్థి యు రవితేజ పిల్ దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాది గంటా రామారావు వాదిస్తూ, కొందరికి మేలు జరిగేలా టెండర్ రూల్స్ ఉన్నాయన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ, టెండర్ ప్రక్రియలో ముగ్గురు బిడ్డర్లు పాల్గొంటే అందుకు ఒక అర్హుడికి కేటాయింపు జరిగిందన్నారు. వాదనల తర్వాత పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కోరుతూ

21న విజయవాడలో ధర్నా

- సిఎంకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్ వాడీల సమస్యల సత్వర పరిష్కారం కోరుతూ ఈనెల 21న విజయవాడ ధర్నా చౌక్‌లో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పేర్కొంది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కారుసాల సుబ్బారావమ్మలు శనివారం సిఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ఎపి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్స్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, అదనపు హెల్పర్‌ను కేటాయించాలని గ్రేడ్ సూపర్ వైజర్ పోస్టుల్లో మినీ వర్కర్లకి అవకాశం కల్పించాలని సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారుగా 6,830 మినీ అంగన్‌వాడీ సెంటర్లుగా నడుస్తున్నాయని, మినీ వర్కర్లు ఏజెన్సీ ప్రాంతాల్లో ,మారుమూల గ్రామాల్లోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారాన్ని వండి పెట్టడం, ఆరోగ్యం, ప్రీస్కూల్ విద్య అందిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. మినీ వర్కర్ల పని, హెల్పర్ల పని చేస్తుండటంతో పనిభారం పెరిగిందన్నారు. ప్రీస్కూల్ నడపడం, రికార్డులు, ఆన్‌లైన్ వర్క్ వంటి అనేక పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. మినీ వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని , వర్కర్లతో సమానంగా వేతనం, వేసవి సెలవులు ఇవ్వడం లేదని, ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు, ఫోన్లు పనిచేయకపోయినా రికార్డులు రాయాలని, ఆన్‌లైన్ వర్క్ చేయాలని బలవంతం చేస్తున్నారని, టిఎ బిల్స్ కూడా ఇవ్వడం లేదని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. బేబీరాణి కారుసాల సుబ్బారావమ్మలు లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చామని అసెంబ్లీలో ప్రకటన చేసినా ఇంత వరకు జీఓ రాలేదన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- విశాఖ మేయర్ ఎన్నికపై జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో సిఎం చంద్రబాబు అరాచకాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసిసి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రజలిచ్చిన తీర్పును అపహాస్యం చేస్తూ బిసి మహిళను మేయర్ పీఠం మీద నుండి దించేశారని తెలిపారు. ప్రజలిచ్చిన తీర్పు ప్రకారం విశాఖ కార్పొరేషన్లో 98 మంది కార్పొరేటర్లు ఉంటే వారిలో 58 మంది వైసిపి గుర్తుపై గెలిచారని, 30 మంది టిడిపి సభ్యులు ఉన్నారని తెలిపారు. మరి నైతికంగా అక్కడ మేయర్ టిడిపి నుండి ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. పైగా వైసిపి కార్పొరేటర్లు ఉన్న హోటల్‌పై టిడిపి నాయకులు గూండాగిరి చేశారని తెలిపారు. విశాఖ మేయర్ ఎన్నిక విషయంలో అధికార పార్టీ పూర్తి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఫలానా పనిచేశానని చెప్పుకుని ఓట్లు అడగలేక చంద్రబాబు అప్రజాస్వామిక విధానాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా, బెదిరించినా చిత్తశుద్ధితో కొందరు కార్పొరేటర్లు ఉన్నారని జగన్ అభినందించారు.

మాజీ ఎంపి హర్షకుమార్ అరెస్టు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



మాజీ ఎంపీ హర్షకుమార్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మరణించిన ప్రదేశంలో కొవ్వొత్తులతో నివాళులర్పించేందుకు హర్షకుమార్ తన ఇంటి నుంచి క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మార్గమధ్యలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో హర్షకుమార్ కుమారులు, క్రైస్తవ సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించి పాస్టర్ ప్రవీణ్ ప్రగడాలకు నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి చెందారని పోలీసులు నిర్ధారించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ జివి హర్షకుమార్ అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రవీణ్‌ను హత్య చేశారంటూ ఆరోపణలు చేశారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-వెల్దుర్తి (కర్నూలు జిల్లా)


రైతు మద్దిలేటి స్వామి

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలో శనివారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామళ్లకోట గ్రామానికి చెందిన మద్దిలేటి స్వామి (70) తనకున్న ఎకరం పొలంతోపాటు మరో 3 ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న, మిరప, వేరుశనగ పంటలు సాగుచేస్తున్నారు. సాగు పెట్టుబడులతోపాటు కుటుంబ అవసరాల కోసం బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల నుంచి సుమారు రూ.30 లక్షల మేర అప్పులు చేశారు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు లేకపోవడంతో అప్పులు చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో గ్రామ సమీపంలోని కంది పొలంలో పురుగుల మందు తాగారు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు స్వామికి భార్య మహేశ్వరమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడం తగదు : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చర్యల్లో భాగంగా నిర్వీర్యం చేయడం తగదని ఐఎన్‌టియుసి నాయకులు రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1528వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం ఇంతలా అభివృద్ధి చెందడానికి స్టీల్‌ప్లాంటే కారణమన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను ప్రయివేటీకరించి, ఉద్యోగులను తగ్గించేస్తే తీవ్ర నష్టమని తెలిపారు. కర్మాగారంపై ఆధారపడి ఉన్న ఇతర పరిశ్రమలూ మూతపడతాయన్నారు. దీంతో వేల కుటుంబాలు ఉపాధికి దూరమవుతాయని తెలిపారు. దేశానికి పట్టుగొమ్మలైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చూడాలని కోరారు.

24న సామూహిక రాయబారం

- పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 24న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సామూహిక రాయబారం నిర్వహించనున్నట్లు ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ వెల్లడించింది. ఈ మేరకు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు డి వెంకట్రామయ్య శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్రంలో 13 వేలకు పైగా పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, సుమారు 48 వేల మంది గ్రీన్ అంబాసిడర్లు ఏళ్ల తరబడి అర్ధాకలితో బతుకుతున్నారని వెల్లడించారు. మున్సిపల్ కార్మికులు విధులను పంచాయతీ కార్మికులు కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల జీతం, పిఎఫ్, ఇఎస్ఐ సాధారణ, ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, చట్టబద్ధమైన సెలవులు అమలవుతున్నాయని వివరించారు. పంచాయతీ కార్మికులకు రాష్ట్రమంతా ఒకే జీతం చెల్లించడం లేదని పేర్కొన్నారు. రూ.4 వేల నుంచి రూ.12 వేల మధ్య చెల్లిస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు కనీసవేతనం, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేసేందుకు అప్పటి ప్రభుత్వం జిఓ 551 విడుదల చేసిందని, 2019లో టిడిపి ప్రభుత్వం మరలా 132 జిఓ జారీ చేసిందని పేర్కొన్నారు. అయినా ఈ జిఓలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతైనా బాధలు తీరుతాయని, జీతాలు పెరుగుతాయని కార్మికులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా తమ బాధలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కనీసం తమ సంఘం నాయకత్వాన్ని పిలిచి కార్మికుల కష్టాలు తెలుసుకుంటారని ఎదురుచూ శామని పేర్కొన్నారు. 6 నెలల నుంచి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తమ సమస్యలపై కార్మికుల నుంచి సేకరించిన సంతకాల చిట్టాను ఈ నెల 24న సామూహిక రాయబారం ద్వారా మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎండలు మరింత తీవ్రం

- ఆరోగ్య సమస్యలున్నవారు జాగ్రత్తలు పాటించాలి
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రం కానున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు ఉన్న వ్యక్తులు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని ఆ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో బిపి, షుగర్, గుండె జబ్బులున్న వ్యక్తులు ఎండలో తిరగకూడదని సూచించారు. శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులు ఎండల వేళ చేయకూడదని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, ఖర్చీఫ్ కట్టుకోవాలని, గొడుగు ఉపయోగించాలన్నారు. చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అకస్మాత్తుగా భారీ వర్షాలు, పిడుగులు కూడా పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తిరుపతి జిల్లా రేణిగుంటలో శనివారం అత్యధికంగా 42.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 42.6 డిగ్రీలు,వైఎస్ఆర్ జిల్లా అట్లూరులో 42.3, పల్నాడు జిల్లా కాకాని 41.6డిగ్రీఉ, అన్నమయ్య జిల్లా కంబాల కుంటలో 41.5 డిగ్రీలు. చిత్తూరు జిల్లా నగరిలో 41.4డిగ్రీలు, నెల్లూరు జిల్లా జలదంకిలో 41.3 డిగ్రీలు, నంద్యాల జిల్లా పాలములపాడులో 41.2డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఆదివారం విజయనగరం జిల్లాల్లోని 10మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని కూర్మనాథ్ తెలిపారు. శ్రీకాకుళంలో 1, విజయనగరంలో 9, మన్యంలో 8, అల్లూరిలో 1 మండలంలోవడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

- క్షేత్రస్థాయి అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసే విధంగా క్షేత్రస్థాయి అధికారులు ఫీల్డ్ సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, హౌసింగ్ ఎమ్‌డి శివప్రసాద్‌లు సూచించారు. అంతేకాకుండా త్వరిత గతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే రోజు వారీ లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక అధికారులను కూడా నియమించి లే అవుట్ల సందర్శనలు పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 12నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 3లక్షల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ నేటికి 1.70లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, మరో 60వేల ఇళ్లు పూర్తి కావడానికి సిద్దంగా ఉన్నట్లు ఎమ్‌డి శివప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులకు రూ.1.87లక్షలు, ప్రభుత్వ పూచీకత్తుతో మరో రూ.35వేలు డ్వాక్రా గ్రూపుల మాదిరిగా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తోందన్నారు. ప్రభుత్వం త్వరిత గతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు వీలుగా అదనపు మొత్తాన్ని మంజూరు చేసిందన్నారు. వెనుకబడిన తరగతుల లబ్ధిదారులు, షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు రూ. 50వేలు, షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారులకు రూ.75వేలు ఇస్తున్నట్లు గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం అదనపు మొత్తాలు మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.300కోట్లు నిధులు విడుదల చేయగా అందులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు రూ.202 కోట్లు విడుదల చేసిందన్నారు. గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి గృహ నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 257 | విజయవాడ, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 20 April 2025 | Rs



బాదేసిన బట్లర్

- గుజరాత్ రికార్డు ఛేదన
- ఢిల్లీపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

6



నేడు డిఎస్‌సి నోటిఫికేషన్

- 16,347 పోస్టుల భర్తీకి షెడ్యూల్ విడుదల
- జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత షెడ్యూల్‌ను ప్రకటించారు. దీని ప్రకారం మొత్తం 16,347 పోస్టులకు నేడు (ఆదివారం - 20వ తేది) నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నెల 20 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది. జూన్ 6 నుంచి జులై 6 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు జిల్లాల వారీ ఉపాధ్యాయ ఖాళీల వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం జిల్లా స్థాయి పోస్టులు 14,088, రాష్ట్రం లేదా జోన్ స్థాయి పోస్టులు 2,259గా షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ విభాగంలో మొత్తం 13,192, ట్రైబల్ వెల్‌ఫేర్ విభాగంలో 881, జువైనెల్ వెల్‌ఫేర్ విభాగంలో 15 పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం మీద 7,487 స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 6,599, పిఇటి రెండు పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు షెడ్యూల్‌లో తెలిపారు. సిబిటి విధానంలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

పాఠశాల విద్యాశాఖలో జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల పట్టిక 5లో

పేదల ఇళ్లపై బుల్డోజర్



ఇళ్లను తొలగించేందుకు బుల్డోజర్లు, పోలీసు బలగాలతో వచ్చిన అధికార యంత్రాంగాన్ని అడ్డుకుంటున్న ప్రజలు

సిపిఎం అండతో అడ్డుకున్న ప్రజలు


ప్రజాశక్తి - భీమవరం

విశాఖపట్నం రుషికొండ ప్రాంతంలో ఎకరం 99 పైసలకే కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టిన ప్రభుత్వం...గూడు లేని నిరు పేదలపై మాత్రం దౌర్జన్యానికి పాల్పడుతోంది. కాలువ గట్టున్న నివశిస్తున్న వారి ఇళ్లు తొలగించేందుకు జెసిబిలతో, పోలీసు బలగాలతో సన్నద్ధమైంది. రాష్ట్రంలోనూ వినాశకర బుల్డోజర్ విధానాలకు తెరలేపింది. అయితే తమ ప్రాణాలు పోయిన సరే ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటామని పేదలు తెగేసిచెప్పారు. అండగా నిలిచిన సిపిఎం నేతలను బలవంతంగా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ప్రజలు తిరగబడ్డారు. ఈ క్రమంలో ఓ మహిళ తలకు తీవ్ర గాయమైంది. మరో ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో పోలీసులు, అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

6

సుప్రీంకోర్టుకు ఆ అధికారం ఉంది

- రాష్ట్రపతి, గవర్నర్ల విధులపైనా ఆదేశాలు జారీ చేయవచ్చు
- మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ స్పష్టీకరణ



చెన్నై : రాష్ట్రపతి, గవర్నరు వంటి రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారితో సహా ప్రభుత్వ కార్యనిర్వాహకులందరి విషయంలోనూ వారివారి విధులను నిర్వవర్తించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసే అధికారం భారత సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ స్పష్టం చేశారు. '75 ఏళ్ల భారత రాజ్యాంగం ప్రయాణం' అనే అంశంపై రాకేష్ లా ఫౌండేషన్, రోజా ముత్తయ్య రీసెర్చ్ లైబ్రరీతో కలిసి శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్యానిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మధ్యనున్న సంబంధాలపై న్యాయనిపుణులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసన సభలు ఆమోదించిన చట్టాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించగలిగే మిగతా 7లో

మిట్టల్‌కు భూకేటాయింపులు చట్ట విరుద్ధం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇఎఎస్.శర్మ లేఖ



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఆర్సెలార్ మిట్టల్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం చట్ట విరుద్ధంగా భూములు కేటాయించిందని, ఆ భూములను వెనక్కి తీసు కోవాలనికేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు ఆయన లేఖ రాశారు. లేఖలోని వివరాలను ఆయన శనివారం మీడియాకు వివరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో స్టీల్ కంపెనీ కోసం , డిఎల్.పురం తీరంలో క్యాప్టివ్ పోర్టు నిర్మాణం కోసం ఎపిఐఐసికి చెందిన 2,200 ఎకరాలకుపైగా భూములను మిట్టల్ సంస్థకు బదలాయించిన విషయాన్ని ఈ లేఖలో ఆయన ప్రస్తావించారు. ఈ బదలాయింపు ద్వారా 1894, 2013 భూ సేకరణ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆయన తెలిపారు. . 'ప్రజా ప్రయోజనాల కోసమని 2010లో ఎపిఐఐసి సేకరించిన 3,873 ఎకరాల జిరాయితీ, డి పట్టా, పేదల సాగు, ప్రభుత్వ భూమిని ప్రయివేటు సంస్థలకు బదలాయించడం చట్ట విరుద్ధం. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తికానందున భూములను ఆర్సెలార్ మిట్టల్‌కు కేటాయించడం చెల్లదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన వారికి ఉదారమైన పరిహారం ఇవ్వాలి. నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా రైతుల భూములను ఆక్రమించకూడదు. డి పట్టా భూముల్లో చెట్లకు, పేదల సాగు భూములకు, అందులోని చెట్లకు నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరం. డి పట్టా రైతులతో సమానంగా సాగుదారులకు నష్టపరిహారం చెల్లించాల్సివుంది' అని లేఖలో శర్మ పేర్కొన్నారు. జిరాయితీ, ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు బదలాయించకూడదని జగపాల్ సింగ్ వెర్సస్ పంజాబ్ ప్రభుత్వం కేసులో 2011 జనవరి 28న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ వర్తించే ఆ తీర్పు ప్రకారం ప్రభుత్వ భూములను మిట్టల్‌కు బదలాయింపు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. చట్టపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే మిట్టల్‌కు కేటాయించిన భూములను, పోర్టు నిర్మాణ ఆమోదాన్ని వెనక్కుతీసుకోవాలని కోరారు. సముద్ర తీరం అక్కడి సంప్రదాయ మత్స్యకారుల, ప్రజల ప్రకతి వనరని పేర్కొన్నారు. దానికి ప్రజల తరపున ట్రస్టీగా ఉండాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా ప్రైవేటు కంపెనీకి బదలాయించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. సముద్రంలో మత్స్య సంపదపై ఆధారపడి మత్స్యకారులు బతుకుతున్నారని, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న పరిశ్రమల కాలుష్యంతో ఆ మత్స్య సంపద తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు, అక్కడి ప్రజల ఉపాధికి జరిగే నష్టాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టుకు అపారమైన నష్టం కలుగుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాభివృద్ధికి ఎన్నో విధాల దోహదం చేసే పై రెండు సంస్థలకూ హానిచేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఈ ప్రాంత ప్రజల మనోభావాలను కించపరిచినట్లు అవుతుందని పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీలో స్పోర్ట్స్ కోటా 3 శాతానికి పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో స్పోర్ట్స్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం మూడు శాతానికి పెంచింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం రెండు శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచారు. మొత్తం 65 ఆటల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఈ రిజర్వేషన్ వర్తిస్తుంది. ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగం సంస్థలు, యూనిఫాం సర్వీస్ అయిన పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖల్లో హరిజెంటల్‌గా రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎపిపిఎస్‌సి, సెలక్షన్ బోర్డులు నిర్వహించే పరీక్షలతో సంబంధం లేకుండా రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించిన తుది మెరిట్ ఆధారంగా సంబంధిత శాఖలు నియమిస్తాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖల నుంచి క్రీడా కోటాలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ రాగానే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఎమ్‌డి క్రీడాకారుల నుంచి దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. దరఖాస్తు పంపే క్రీడాకారులు అతను పాల్గొన్న క్రీడ పేరు, సాధించిన మెడల్స్ వంటి మిగతా 7లో

మద్యం పాలసీలో ప్రైవేటు వ్యక్తులు ఎవరు?

- మిథున్‌రెడ్డిని ప్రశ్నించిన సిట్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం కేసు విచారణలో భాగంగా ప్రారంభించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) రెండోరోజు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని విచారించింది. శనివారం ఉదయం సిట్ చీఫ్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యాన మొదలైన విచారణ సాయంత్రం వరకూ కొనసాగింది. ఈ విచారణలో మద్యం పాలసీ రూపకల్పన, అందులో పాల్గొన్న ప్రైవేటు వ్యక్తులు ఎవరన్న అంశాలపై పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. భోజన విరామ సమయం అనంతరం పలు డాక్యుమెంట్లను మిథున్‌రెడ్డికి చూపించినట్లు తెలిసింది. వాటి వివరాలను అడగ్గా వాటి గురించి తనకు తెలియదని, ఎపి బేవరేజేస్ మాజీ ఎంపి వాసుదేవరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పినట్లు సమాచారం. విజయసాయిరెడ్డితో పాటు పలువురు ఇతరులను విచారించిన సమాచారాన్ని మిథున్‌రెడ్డి ముందు ఉంచి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే అరబిందో ఫార్మా నుండి ఆదాన్ డిస్టిలరీ, డికార్ట్ సంస్థలకు విజయసాయిరెడ్డి రుణాలు ఇప్పించారని తెలిపారని, అందులో మిథున్‌రెడ్డి పాత్ర ఏమిటో చెప్పాలని అడిగినట్లు తెలిసింది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డి స్నేహితులతో ఉన్న ఆర్థిక సంబంధాలపైనా వివరాలు అడిగినట్లు తెలిసింది. లిక్కర్ పాలసీలో కీలకంగా ఉన్న రాజ్ కసిరెడ్డి కంపెనీల నుండి ఎపి బేవరేజస్‌కు ఎంత మద్యం అమ్మారనే అంశాలపైనా మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు వివరాలు అడిగినట్లు తెలిసింది. మిథున్‌రెడ్డి న్యాయవాది సమక్షంలోనే విచారణ జరిగింది. అయితే ఏడు గంటల విచారణ అనంతరం ఆయనిచ్చిన స్టేట్‌మెంట్‌పై సంతకాలు తీసుకుని పోలీసులు పంపించేశారు.

విజయసాయిరెడ్డి బండారం బయటపెడతా : రాజ్

మద్యం పాలసీ విషయంలో విజయసాయిరెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై త్వరలోనే అన్ని విషయాలూ బయట పెడతానని రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖరరెడ్డి) వెల్లడించారు. ఈ మేరకు శనివారం వీడియో విడుదల చేశారు. విజయసాయిరెడ్డి ఇంట్లో జరిగిన చర్చలు, అక్కడ తీసుకున్న నిర్ణయాలను త్వరలోనే వెల్లడిస్తానని పేర్కొన్నారు. తాను లేని సమయంలో ఇంటికి పోలీసులు వచ్చి నోటీసులు ఇచ్చారని, తాను ఉన్న సమయంలో ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇదే అంశంపై కోర్టులోనూ పిటిషన్లు వేశానని పేర్కొన్నారు.

జిందాల్ పరిశ్రమను వెంటనే తెరవండి

యాజమాన్యానికి కార్మిక శాఖ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిందాల్ పరిశ్రమను వెంటనే తెరవాలని యాజమాన్యాన్ని కార్మిక శాఖ ఆదేశించింది. పరిశ్రమను తెరవడం ఆలస్యమైనన్ని రోజులూ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. లాకౌట్‌కు సంబంధించి యాజమాన్యం చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని, అక్రమంగా లాకౌట్ చేశారని కార్మికశాఖ తేల్చింది. అంతకుముందు విజయనగరంలోని కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక సంఘాల జెఎసి నాయకులు, జిందాల్ పరిశ్రమ యాజమాన్యంతో కార్మికశాఖ అధికారులు శనివారం చర్చలు జరిపారు. తొలుత పరిశ్రమ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. ఆ తర్వాత కార్మిక సంఘాల అభిప్రాయాలను తెలుసుకుంది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జెఎసి నాయకులు తమ్మినేని సూర్యనారాయణ (సిఐటియు), పి.అప్పలరాజు (టిఎన్‌టియుసి) మాట్లాడుతూ.. కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చించకుండా లాకౌట్ విధించడం అన్యాయమని, ఉన్న పళంగా లాకౌట్ విధిస్తే కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు.

తక్షణమే అక్రమ లాకౌట్‌ను ఎత్తేయాలని కోరారు. యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు, ముడిసరుకు ధర రెట్టింపు, విద్యుత్ ఛార్జీల భారం వల్ల కంపెనీ నష్టాల్లో ఉందని, అందువల్ల లాకౌట్ విధించినట్లు తెలిపారు. ఇరువురు అభిప్రాయాలు తెలుసుకున్న కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడం తగ్గదన్నారు. సహేతుకమైన కారణాలు లేకుండా మూసివేసిన పరిశ్రమను వెంటనే తెరవాలని ఆదేశించారు. కార్మికు లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చర్చల్లో కార్మిక సంఘాల నాయకులు ఎస్.చిన్నబాబు, పి.చినబాబు (సిఐటియు), కాంట్రాక్ట్ కార్మికులు సంఘం అధ్యక్షులు బి.ఈశ్వరరావు (సిఐటియు), భీమా, బి.అప్పారావు (టిఎస్‌టియుసి) వైసిపి నాయకులు ఓమాలు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పరిశ్రమలో సుమారు 320 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు.



కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్న కార్మికశాఖ అధికారులు



అవిశ్వాసం నెగ్గడంతో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

జివిఎంసిలో నెగ్గిన అవిశ్వాస తీర్మానం

మేయర్ పీఠం కూటమిదే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జివిఎంసి మేయర్ పీఠాన్ని టిడిపి కూటమి కైవసం చేసుకోనుంది. వైసిపికి చెందిన మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై తెలుగుదేశం, జనసేన, బిజెపిలు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసిలో ఇన్‌ఛార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. జివిఎంసిలో అవిశ్వాసం నెగ్గేందుకు 74 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా అవిశ్వాసానికి అనుకూలంగా టిడిపి కూటమి పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటేశారు. వైసిపి కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఈ సమావేశాన్ని బహిష్కరించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేశాక ఇంతవరకూ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన చరిత్ర లేకపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో మేయర్ పీఠంపై తీవ్ర చర్చ సాగింది. ఇదిలా ఉండగా.. అవిశ్వాస తీర్మానం కేవలం అడ్డగోలుగా, అధికారం కోసం జరుగుతోందంటూ ఓటింగ్‌లో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ పాల్గొనలేదు. కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి హాజరుకాలేదు. మేయర్ పీఠాన్ని టిడిపి కూటమి దక్కించుకోవడంతో జివిఎంసి కార్యాలయం బయట టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

ఢిల్లీలో భవనం కూలి 11 మంది మృతి

- మరో 11 మందికి తీవ్రగాయాలు

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలోని ముస్తాఫాబాద్ శక్తివిహార్‌లో శనివారం తెల్లవారుజామున నాలుగంతస్తుల భవనం కూలిపోవడంతో నలుగురు పిల్లలుసహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఒక దుకాణం స్థంబాన్ని రీ మోడలింగ్ కోసం తొలగించడంతో భవనం కూలిపోయిందని మృతుల బంధువులు చెబుతున్నారు. ఇంటి యజమాని తెహ్సాన్ కూడా మరణించిన వారిలో ఉన్నారు. ఘటనపై దర్యాప్తునకు ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వడదెబ్బతో 'ఉపాధి' కార్మికుడు మృతి



ప్రజాశక్తి-సింహాద్రిపురం (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా సింహాద్రిపురం మండలంలో వడదెబ్బతో ఉపాధి హామీ కార్మికుడు మృతి చెందారు. శనివారం మండలంలోని గురజాలలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పనులకు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి(50) వెళ్లారు. పనిచేస్తున్న క్రమంలో ఎండి వేడిమికి తాళలేక అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య ఈశ్వరమ్మతో పాటు కుమారులు ఉన్నారు. ఎపిఓ జయభారతి, ఇసి శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతుని కుటుంబాన్ని ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి పనులు చేస్తూ మరణించిన వారికి పరిహారంగా రూ.పది లక్షలు ఇవ్వాలని, మృతుని కుటుంబానికి మూడు ఎకరాల పొలం, సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా ఉపాధి పనుల ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, త్రాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాల్సివుందని, కానీ ప్రభుత్వం ఇవేవీ ఏర్పాటు చేయకపోవడంతో ఉపాధి కార్మికులు ఎండ తీవ్రత తాళలేక పని ప్రదేశాల్లోనే తనువు చాలిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే కార్మికులకు రెండు వారాలు బకాయిలు, వేసవి అలవెన్సులకు నిధులు ఇవ్వడం లేదని చెప్పారు. ఇప్పటి కైనా ప్రభుత్వం ఉపాధి పని ప్రదేశాల్లో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చర్యలు చేపట్టాలని, పని వేళలు సైతం మార్చాలని కోరారు.

భారత్‌కు ఎలాన్ మస్క్



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు, పలు వివాదస్పద అంశాల్లో కీలక సూత్రదారి అయిన స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల అధినేత ఎలాన్ మస్క్ ఈ ఏడాది చివర్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ఆయనే వెల్లడించారు. ప్రధాని మోడీతో సంభాషించడం గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందే మస్క్ భారత్‌లో పర్యటించాల్సి ఉన్నా.. చివరి నిమిషంలో తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. అప్పట్లో ఆయన చైనాను సందర్శించారు. కాగా వాణిజ్య ఒప్పందాలపై భారత్, అమెరికా మధ్య చర్చలు కొనసాగుతున్న వేళ ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడారు. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురు చర్చించారు. ఈ విషయాన్ని మోడీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనికి స్పందనగా మస్క్ తన భారత్ పర్యటనను ధ్రువీకరించారు.

సంపాదకీయం


వినోదం.. విజ్ఞానం..

వేసవి సెలవులు మళ్లీ వచ్చాయి. దాదాపు రెండు మూడు దశాబ్దాల క్రితం అయితే, ఎంత గొప్పగానో వుండేవి. వేసవి సెలవుల కోసం పిల్లలు, పెద్దలూ వేయి కళ్లతో ఎదురుచూసేవారు. గ్రామాల్లో వుండేవారు పట్టణాలకు, పట్టణాల్లో వుండేవారు గ్రామాల్లోని అమ్మమ్మ, నాయనమ్మల ఇళ్లకు వెళ్లేందుకు ఎంతో ఉత్సుకతతో వుండేవారు. వేసవి సెలవులు పిల్లలకు ఆహ్లాదకర సమయం. వేడి గాలులు వీస్తున్నా, స్నేహితులతో ఆడుకోవడం, కొత్త ప్రదేశాలు చూడటం, కొత్తకొత్త ఆహార పదార్థాలను రుచి చూడటం మహా సరదాగా వుంటుంది. వేసవి సెలవులు పిల్లలకు అతి పెద్ద ఆటవిడుపుగా, మనోల్లాస వేదికలుగా వుంటాయి. కాలంతో పాటు జీవన విధానంలోను, బాల్యంలోనూ అనేక మార్పులొచ్చాయి. నేటి తరానికి ఆధునిక వేసవి మొక్కుబడిగా మారింది. కొందరు విద్యార్థులకైతే, మామూలు రోజులకూ వేసవి సెలవులకు పెద్ద తేడా కనిపించదు. అయితే ఈ సెలవులను కేవలం వినోదం కోసమే కాకుండా, వారిలో విజ్ఞాన తృష్ణను పెంచేలా ప్రణాళికలు వేయడం తల్లిదండ్రుల బాధ్యత. వారి స్తోమతకు తగిన విధంగా మార్గదర్శనం చేయడం ఉపాధ్యాయుల వంతు.

'విద్య అనేది జీవితానికి సన్నాహం కాదు, విద్య అంటే జీవితమే' అంటాడు జాన్ డ్యూయీ అనే విద్యావేత్త. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ. వేసవి సెలవుల్లో పొందే అనుభవాలు, గడించే విజ్ఞానం కూడా విద్యలో భాగమే. ఈ విషయాన్ని ఇప్పటి కార్పొరేట్ చదువులు మరుగుపరుస్తున్నాయి. చాలామంది తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లలను వివిధ కోచింగ్ సెంటర్లకు తరిమేస్తుంటారు. కేవలం పరీక్షలు, ర్యాంకుల కోణంలో కాకుండా, నిజమైన లోకజ్ఞానం కూడా అవసరమే. పిల్లల ఆసక్తి మేరకు సైన్స్ మ్యూజియంలు, ప్లానిటోరియంలకు తీసుకెళ్లడం, చారిత్రక ప్రదేశాలను చూపడం గొప్ప అనుభవం, విజ్ఞానదాయం కూడా. సమకాలీన అంశాలపై పట్టు సాధించేందుకు పుస్తకం, దినపత్రికల పఠనం, గ్రంథాలయాలకు వెళ్లడం ఎంతగానో దోహదపడతాయి. మొబైల్ ఫోన్లకు అలవాటు పడిన పిల్లలు ఇతర పుస్తకాలు చదవడం ఎప్పుడో మర్చిపోయారు. నాలుగు గోడల మధ్య పాఠ్యాంశాలను వల్లెవేసే పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేస్తే... ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు... భాష, భావాల వెల్లడిలో సృజనకారులుగా తయారవుతారు. కంప్యూటర్ విద్యకు అలవాటు పడిన పిల్లలు అందమైన చేతిరాతను కూడా మర్చిపోతున్నారు. గతంలో సెలవుల్లో స్నేహితులకు రంగురంగుల కాగితాలపై నిండుగా, అందమైన అక్షరాలతో ఉత్తరాలు రాసే అలవాటుండేది. ఇప్పుడా అలవాటు పూర్తిగా కనుమరుగైపోయింది.

మనిషికైనా, సమాజానికైనా మార్పు, ఆధునిక జీవన విధానం అవసరమే. అయితే, అది భవిష్యత్‌ను అంధకారం చేసేదిగా వుండకూడదు. తాము చదవలేని చదువులు, తాము చేయలేని ఉద్యోగాలు తమ పిల్లల ద్వారా సాధించుకోవాలనుకునే తల్లిదండ్రుల కలలు, విద్యను వ్యాపారంగా మార్చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలు, వీటికి కొమ్ముగాస్తున్న ప్రభుత్వాలు... అన్నీ కలిసి పిల్లల అందమైన భవితను చిదిమేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. లేలేత సూర్యకిరణాలు ముఖం మీద పడుతుంటే కళ్లు నులుముకుంటూ నిద్రలేచే బాల్యం... ఎప్పుడో కనుమరుగైంది. తెల్లవారకముందే మోయలేనంత పుస్తకాల సంచులను భుజానేసుకుని పరుగులెత్తే బాల్యమే ఇప్పుడు మనకు దర్శనమిస్తుంది. 'పిల్లల మనసు ఒక తెల్లకాగితం లాంటిది. మనం దానిపై మంచి విషయాలు రాయాలి' అంటారు రవీంద్రనాథ్ టాగోర్. పిల్లల మనసులను సృజనాత్మకంగా వికసింపజేయడానికి వేసవి సెలవులు చక్కని అవకాశం. విజ్ఞానాన్ని, నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశాన్ని కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత. మంచి పుస్తకాలు చదివే అలవాటును, ప్రకృతితో మమేకం కావడాన్ని పిల్లలకు నేర్పించాలి. తద్వారా పర్యావరణ స్పృహ అలవడుతుంది. అదే సమయంలో సాంకేతిక విజ్ఞానాన్నీ నేర్చుకోవాలి. అది పిల్లల విజ్ఞానాన్ని, భాషా నైపుణ్యాన్ని మరింత విస్తృతం చేస్తుంది. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి కళలతో పాటు క్రీడలు మానసిక వికాసాన్నిస్తాయి. పిల్లలు పాఠ్యాంశాల ఒత్తిడిని పక్కన పెట్టి, ఈ వేసవి సెలవులను వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా గడపాలి.

మహనీయుల మాట




జ్ఞానం వంశపారంపర్యంగా
వచ్చేది కాదు.
దానిని ఎవరికి వారు
సంపాదించుకోవాల్సిందే.
- స్టీవ్‌జాబ్స్



సుప్రీం కోర్టుపై అన్యాయ యుద్ధం

గౌరవప్రదమైన రాజ్యసభ అధ్యక్ష స్థానం నుంచే సుప్రీంకోర్టుపై దాడి జరుగుతున్నా ఇంతవరకు ప్రధానమంత్రిగాని పాలక పార్టీ సీనియర్ నేతలు కానీ పెదవి విప్పకపోవడం శోచనీయం. సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ మే14వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనుండగా ఈ హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఆయన రూపొందించిన రాజ్యాంగం వల్లనే తాను ప్రధానిని కాగలిగానని చెప్పే వ్యక్తి దేశాన్ని పాలిస్తుండడం గర్వకారణమని మొన్న అంబేద్కర్ ఉపన్యాసం చేస్తూ జస్టిస్ గవాయి ప్రశంసించారు. ఇప్పుడు ఆ ప్రధాని...రాజ్యాంగ నియమాలకు భిన్నంగా మాట్లాడిన ధన్‌కర్‌ను ఏం చేస్తారో చూడాలి.



ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం, సామాజిక న్యాయం దిశలో సుప్రీంకోర్టు .... కీలకమైన అడుగులు వేస్తున్నదని సంతోషిస్తున్న సమయంలోనే సాక్షాత్తు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ సుప్రీంకోర్టుపైన అనూహ్యమైన రీతిలో దాడి చేయటం దిగ్భ్రాంతి కలిగించవచ్చు. కానీ నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని బలపరచడంలోనూ ఆరెస్సెస్‌కు విధేయత చాటుకోవడంలోనూ ధన్‌కర్ అత్యుత్సాహం చూస్తున్న వాళ్లకు ఇదేమీ ఆశ్చర్యం కలిగించదు. న్యాయ వ్యవస్థపై ఆయన దాడి చేయడం ఇదే మొదటిసారి కాదు కూడా. సమయం, సందర్భం లేకుండా నిరంతరం బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం ఆయనకు పరిపాటిగా మారింది. రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని నిర్వచించడంలో సుప్రీంకోర్టుకు గల హక్కును గతంలోనే ఆయన సభ సాక్షిగా సవాలు చేశారు. రాజ్యాంగం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హక్కును ప్రభుత్వంతో అంటే కార్యనిర్వాహక వర్గంతో ఘర్షణగా ఆయన చిత్రిస్తుంటారు. ప్రగతిశీల కోణంలో వ్యవస్థల పాత్రను చర్చించడం వేరు. ఆ విధంగా చూసినప్పుడు మనం న్యాయ వ్యవస్థలో సంస్కరణలు రావాలని చెప్పొచ్చు. కానీ పాలకపక్ష నిరంకుశ పోకడలను సమర్థించడం కోసం న్యాయ వ్యవస్థపై దాడి చేయడం, కేంద్రానికి లోబడి వ్యవహరించాలని చెప్పడం అందుకు విరుద్ధం.



తెలకపల్లి రవి

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి శాసనసభ ఆమోదించిన పది బిల్లులను తొక్కిపట్టిన నేపథ్యంలో రాజ్యాంగ సమాఖ్యను సంరక్షించేలా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ తర్వాత కొత్త వక్ఫ్ చట్టం మైనార్టీల హక్కులకు భంగం కలిగించకుండా అత్యున్నత న్యాయస్థానం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసి విచారణ కొనసాగిస్తున్నది. కేంద్రం అభ్యర్థన మేరకు దానిపై స్టే ఇవ్వకుండా ఆగింది. భారత రాజ్యాంగ మూలసూత్రాలుగా పేర్కొనబడే ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం, సామాజిక న్యాయం దిశలో సుప్రీంకోర్టు ఈ విధంగా కొన్ని కీలకమైన అడుగులు వేస్తున్నదని సంతోషిస్తున్న సమయంలోనే సాక్షాత్తు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ సుప్రీంకోర్టుపైన అనూహ్యమైన రీతిలో దాడి చేయటం దిగ్భ్రాంతి కలిగించవచ్చు. కానీ నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని బలపరచడంలోనూ ఆరెస్సెస్‌కు విధేయత చాటుకోవడంలోనూ ధన్‌కర్ అత్యుత్సాహం చూస్తున్న వాళ్లకు ఇదేమీ ఆశ్చర్యం కలిగించదు. న్యాయ వ్యవస్థపై ఆయన దాడి చేయడం ఇదే మొదటిసారి కాదు కూడా. సమయం, సందర్భం లేకుండా నిరంతరం బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం ఆయనకు పరిపాటిగా మారింది. రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని నిర్వచించడంలో సుప్రీంకోర్టుకు గల హక్కును గతంలోనే ఆయన సభ సాక్షిగా సవాలు చేశారు. రాజ్యాంగం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హక్కును ప్రభుత్వంతో అంటే కార్యనిర్వాహక వర్గంతో ఘర్షణగా ఆయన చిత్రిస్తుంటారు. ప్రగతిశీల కోణంలో వ్యవస్థల పాత్రను చర్చించడం వేరు. ఆ విధంగా చూసినప్పుడు మనం న్యాయ వ్యవస్థలో సంస్కరణలు రావాలని చెప్పొచ్చు. కానీ పాలకపక్ష నిరంకుశ పోకడలను సమర్థించడం కోసం న్యాయ వ్యవస్థపై దాడి చేయడం, కేంద్రానికి లోబడి వ్యవహరించాలని చెప్పడం అందుకు విరుద్ధం. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు తగలబడ్డాయన్న కథనాల నేపథ్యంలో ఈ రెండు అంశాలను కలగలిపి రెండు రకాలుగా మాట్లాడ్డం మనం చూశాం (ఏప్రిల్ 3 ప్రజాశక్తిలో ఈ రచయిత వ్యాసం). అప్పుడు కూడా చెలరేగిపోయిన ధన్‌కర్ పైత్యం ఇప్పుడీ సందర్భంలో మరీ పరాకాష్టకు చేరింది.

రాష్ట్రపతి అతీతమా?

రాష్ట్ర ప్రభుత్వ శాసనసభలు ఆమోదించిన తీర్మానాలపై అంగీకార ముద్ర వేయటానికి గవర్నర్లు అనిశ్చితమైన అంతులేని ఎడతెగని జాప్యం చేయడం రాజ్యాంగం 200 అధికరణం ప్రకారం చెల్లుబాటు కాదని మాత్రమే సుప్రీంకోర్టు చెప్పింది. కాలవ్యవధి అంటూ పేర్కొనడం తప్పనిసరిగా పాటించాల్సిన న్యాయ సూత్రం. ఈ వ్యవహారం రాష్ట్రపతితో కూడా ముడివడి ఉన్నందున ఆయన కూడా ఒక కాలవ్యవధి పాటించాలని మాత్రమే సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. అంతేకానీ ఆమోదం తిరస్కారంపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. రాజ్యాంగపరమైన సందేహాలపై సంప్రదింపులకు తమ సేవలు అందుబాటులో ఉంటాయని కూడా చెప్పింది. ఇది రాష్ట్రపతికి గౌరవం తప్ప తక్కువ చేయటం కాదు. ఉపరాష్ట్రపతి స్థాయిలోని వ్యక్తి దీన్ని రాష్ట్రపతికి ఆదేశించడం అని చెప్పడం నిజంగా అర్థరహితం. తెలంగాణ ఎమ్మెల్యేల కండువా మార్పు కేసుపై విచారణ సందర్భంలోనే సుప్రీంకోర్టు తమకు ఏ పదవిలో వారికైనా సూచనలు చేసే అధికారం ఉందని పేర్కొంది. అయితే రాష్ట్రపతిని కూడా ఆదేశిస్తారా అని అప్పుడే కొంతమంది సన్నాయి నొక్కులు నొక్కారు. ఆ మాటల లోతు పాతులు ఏమిటో గవర్నర్ల కేసు తీర్పుతో స్పష్టమైంది. వ్యవస్థల మధ్య ఘర్షణ మంచిది కాదని సూక్తులు మాట్లాడే ముందు అసలు సమస్య కోణాలు ఏమిటో పరిశీలించటం అవసరం. కేంద్రం ఏకపక్ష వైఖరితో రాష్ట్రాల హక్కులను అధికారాలను వనరులను కాలరాస్తున్నప్పుడు కాపాడవలసిన బాధ్యత సుప్రీంకోర్టుదే కదా. తమిళనాడు తర్వాత కేరళ కేసు మే 13న విచారణకు వస్తుందంటే సుప్రీంకోర్టు చెప్పకుండానే ధన్‌కర్ వీరంగానికి బ్రేకులు వేస్తున్నది అన్నమాట. ఆ మాటకొస్తే భారత ఉపరాష్ట్రపతి పదవి లాంచన ప్రాయమైనదని అందరికీ తెలుసు. సాధారణ పరిస్థితులలో ఉపరాష్ట్రపతికి రాజ్యసభకు అధ్యక్షత వహించటం మినహా వేరే పెద్ద బాధ్యతలేమీ రాజ్యాంగం అప్పగించింది లేదు. కనుక ధన్‌కర్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగానే ఈ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. నిజానికి రాజ్యాంగం 74వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి కేంద్ర మంత్రివర్గ సిఫార్సులపైనే నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. రాజ్యాంగం 361వ అధికరణం రాష్ట్రపతికీ, గవర్నర్లకూ కోర్టులలో విచారణ అభిశంసన నుంచి మినహాయింపునిస్తున్న మాట నిజమే. అయితే వారు రాజ్యాంగానికి అతీతులని కాదు. రాష్ట్రపతి పాలన విధించే విషయంలో సుప్రీంకోర్టు 1994లో ఎస్.ఆర్.బొమ్మై కేసులో నిర్దేశాలు జారీ చేయడం తెలిసిందే. మరణశిక్ష రద్దు కోసం పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్లపై రాష్ట్రపతి మూడు మాసాల లోపు నిర్ణయం తీసుకోవాలని గతంలో కూడా సుప్రీంకోర్టు గడువు పెట్టింది. కనుక ఇదేదో కొత్తగా జరిగినట్టు వాపోవడం రెచ్చిపోవడం దేనికి? రాజ్యాంగం 143వ అధికరణం కింద రాష్ట్రపతి ఏదైనా అంశంపై సుప్రీంకోర్టు అభిప్రాయాలు కోరడం జరుగుతుంది. గతంలో బాబ్రీ మసీదు/రామ జన్మభూమి వివాదం ఆ విధంగానే కోర్టుకు నివేదించారు కూడా. రాజ్యాంగం 145(3) అధికరణం ప్రకారం ఏదైనా అంశం చట్టం రాజ్యాంగబద్ధమా కాదా అని నిర్ణయించాల్సింది అంతిమంగా చెప్పాల్సింది, చెప్పగలిగింది సుప్రీంకోర్టు మాత్రమే. ధన్‌కర్ దాన్ని సవాల్ చేయడం యథాలాపంగా జరిగింది కాదు. ఇంతా చేసి సుప్రీంకోర్టు పెట్టిన మూడు నెలల గడువు కూడా పాతదే. ఇందిరా గాంధీ హయాంలో నియమితమైన జస్టిస్ సర్కారియా కమిషన్ (1983), జస్టిస్ పూంఛీ కమిషన్ (2007)లో గవర్నర్లు బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధినివ్వాలని సిఫార్సు చేశాయి. ఆఖరుకు మోడీ సర్కార్ వచ్చాక 2-4-2016 వ తేదీన హోంశాఖ పంపిన సర్క్యులర్ లోనూ రాష్ట్రపతి కార్యాలయం మూడు నెలల్లో బిల్లుల ఆమోదంపై నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించింది. ఇదే సుప్రీంకోర్టు పునరుద్ఘాటిస్తే ధన్‌కర్ తప్పు పడుతున్నారు. కేరళ గవర్నర్‌తో సహా చాలామంది చిందులు తొక్కుతున్నారు.

నిరసన ధ్వనులు

సహజంగానే సుప్రీంకోర్టుపై ధన్‌కర్ యుద్ధంపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రముఖ న్యాయవాది రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ సుప్రీం కోర్టు బాధ్యతలపై ఇది దాడి చేయడమేనన్నారు. ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు లోక్‌సభ మాజీ కార్యదర్శి పి.డి.టి. ఆచారి న్యాయస్థానం చెప్పిన దాంట్లో అసలు పొరపాటు ఏమీ లేదని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి ఉన్నత పదవికి సంబంధించిన రాజ్యాంగ మర్యాదలను అతిక్రమించారనీ, గతంలోను ఇలా జరిగిందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సంపాదకీయం గుర్తు చేసింది. అత్యున్నత న్యాయస్థానాన్ని సూపర్ పార్లమెంట్‌గా మారిపోయిందని ఎగతాళి చేయడం సరైనదేనా? న్యాయమూర్తులకు అసలు జవాబుదారీతనం లేకుండా పోయిందని, ఎందుకంటే దేశంలో చట్టాలు వారికి వర్తించవని ఆయన అన్న మాటలు మరింత అద్వాన్నమైనవని అభిశంసించింది. అన్నిటిని మించి ప్రజాస్వామిక శక్తులపై 24/7 అణు క్షిపణుల్లా సుప్రీంకోర్టు అధికారాలు ఉంటున్నాయని చెప్పడం ఏమిటని టైమ్స్ ప్రశ్నించింది. ఉపరాష్ట్రపతి మాటలకు రాజ్యాంగబద్ధంగా ఎలాంటి విలువ లేదని పాఠకులు గ్రహించాలని కూడా చెప్పింది.

వక్ఫు బిల్లుపై సుప్రీంకోర్టు రెండు సార్లు విచారణ జరిపి, మూడు కచ్చితమైన బ్రేకులు వేసింది (1.వక్ఫ్ భూములపై కోర్టుల గత తీర్పులకు కట్టుబడి ఉండాల్సిందే. 2. వినియోగంలో వక్ఫ్ భూములుగా ఉన్న వాటిని కలెక్టర్ విచారిస్తున్నారనే కారణంతో రద్దు చేయకూడదు. 3. కేవలం అధికార పూర్వక పదవులకు మాత్రమే ముస్లిమేతరులు పరిమితం కావాలి). ఆ సమయంలోనే ధన్‌కర్ వ్యాఖ్యలు వెలువడం యాదృచ్ఛికం కాదు. న్యాయ శాఖామంత్రి కిరణ్ రిజిజు విచారణ జరుగుతుండగానే రాష్ట్రాలు తప్పనిసరిగా కేంద్ర వక్ఫు చట్టాన్ని అమలు చేసే తీరాలని హెచ్చరించడం గమనార్హం. పై విచారణ క్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ధర్మాసనాన్ని ఉద్దేశించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్యలు మరింత తీవ్రంగా ఉన్నాయి. "వక్ఫ్‌లో ముస్లిమేతరులు ఉండకూడదని చెప్పేట్లయితే దాన్ని విచారించే ఈ ధర్మాసనంలో మీరు కూడా కూర్చోవడానికి అవకాశం ఉండదని" మెహతా నోరు పారేసుకున్నారు. "దాని గురించి మీరు ఏం భయపడకండి. ఒకసారి ఈ స్థానంలో కూర్చున్న తర్వాత మాకు ఏ మతం ఉండదు. పూర్తిగా లౌకిక తత్వంతో వ్యవహరిస్తాము" అని సిజెఐ మొహం వాచేలా చెప్పాల్సి వచ్చింది. మెహతా కేంద్ర ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నారని ఇక్కడ గుర్తించడం అవసరం.

ఇదో పథకమా?

న్యాయమూర్తుల, న్యాయస్థానాల పొరబాట్లు చాలానే ఉన్నాయి. అనేకమంది న్యాయమూర్తులు ఇటీవల కాలంలో సంఘపరివార్ భావజాలాన్ని ప్రకటిస్తున్నారు. వ్యవస్థల మధ్య సమతుల్యత కాపాడటం అవసరమైనప్పటికీ రాజ్యాంగం నిర్దేశించిన న్యాయవ్యవస్థ ప్రతిపత్తిని దెబ్బతీసే మాటలు, చర్యలు మాత్రం సహించరానివి. దేశ ప్రజల, రాజకీయ పక్షాల, సంస్థల, పౌరుల హక్కులను చట్ట పరిధిలో కాపాడవలసింది హైకోర్టులు, సుప్రీంకోర్టు మాత్రమే. ధన్‌కర్ మాటలను మహేష్ జెఠ్మలాని వంటి సీనియర్ న్యాయవాదులు, బిజెపి నేతలు బలపరచటం ఆందోళన కలిగిస్తుంది. నిజంగానే రాజ్యాంగ స్ఫూర్తికి భాష్యం చెప్పే బాధ్యతను సుప్రీం కోర్టుకు లేకుండా చేసే విషయం ఆలోచించాలని కొంతమంది మాట్లాడుతున్నారు. ఇలా గౌరవప్రదమైన రాజ్యసభ అధ్యక్ష స్థానం నుంచే సుప్రీంకోర్టుపై దాడి జరుగుతున్నా ఇంతవరకు ప్రధానమంత్రిగాని పాలక పార్టీ సీనియర్ నేతలు కానీ పెదవి విప్పకపోవడం శోచనీయం. సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ మే14వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనుండగా ఈ హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఆయన రూపొందించిన రాజ్యాంగం వల్లనే తాను ప్రధానిని కాగలిగానని చెప్పే వ్యక్తి దేశాన్ని పాలిస్తుండడం గర్వకారణమని మొన్న అంబేద్కర్ ఉపన్యాసం చేస్తూ జస్టిస్ గవాయి ప్రశంసించారు. ఇప్పుడు ఆ ప్రధాని... రాజ్యాంగ నియమాలకు భిన్నంగా మాట్లాడిన ధన్‌కర్‌ను ఏం చేస్తారో చూడాలి.

ఆనందం కరువైన అభివృద్ధి

'ప్రపంచ సంతోష నివేదిక' సైన్సూ, సంపద వున్నంత మాత్రాన సంతోషంగా వున్నట్టు చెప్పలేమంటోంది. పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా ఎంతో ముందున్న అమెరికా, యూరపు దేశాలు సంతోషపరంగా వెనక్కి వెళుతున్నాయని హెచ్చరిస్తోంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయనీ అక్కడి లక్ష మరణాల్లో 23 ఆత్మహత్యలేననీ లెక్కేసి మరీ చెప్తోంది. ఈ దేశాల పురుషుల్లో, మధ్య వయస్కుల్లో నిస్పృహ, అభద్రతా పెరగడం ప్రమాదకరమంటోంది.



'ఆనందమె జీవిత మకరందం' అంటాడు సినీ కవి సముద్రాల. ఇంతకూ సదరు ఆనందానికి మూలకందం ఏది? అంతులేని సంపదలా? అఖండ జ్ఞాన విజ్ఞానాలా? శాంతి సామరస్యాలా? స్నేహమయ సామాజిక సంబంధాలా? జనచైతన్యమా? ప్రజానుకూల పాలనా విధానాలా? ఇటీవల విడుదలైన 'ప్రపంచ సంతోష నివేదిక' (2025) వీటన్నిటిని తనదైన శైలిలో విశ్లేషించి దేశాలకు ర్యాంకులిస్తుంది. వీటిల్లో కొన్ని మన కళ్ళు తెరిపిస్తాయి. కొన్ని నివ్వెర పరుస్తాయి. కొన్ని ఉసూరుమనిపిస్తాయి.

ఈ నివేదిక ప్రపంచ దేశాల్ని మూడు గ్రూపులుగా విడదీస్తుంది. మొదటి 48 దేశాలు ఆనందంలో ముందున్నవి. వీటిలోనూ అగ్రభాగాన వున్న 20 దేశాల్లో 14 పారిశ్రామిక యూరపు దేశాలు. ఫిన్‌లాండుది ప్రథమ స్థానం. డెన్మార్కు, ఐస్లాండు నార్వే, స్వీడన్లవి తర్వాతి స్థానాలు. ఆశ్చర్యం ఏమంటే కోస్టారికా, మెక్సికోలకు మొదటి పది ర్యాంకుల్లో చోటు దక్కడం. ఎల్ సాల్వడార్, నికరాగువా, వియత్నాంలు మొదటి గ్రూపులోకి దూసుకురావడం. ఇక అమెరికా 11 స్థానాలు పోగొట్టుకొని 24వ స్థానానికి దిగజారిపోగా, బ్రిటన్ 2017 తర్వాత ఎప్పుడూ లేనట్టుగా 23వ స్థానంతో సరిపెట్టుకుంది! ఇజ్రాయిల్ 8వ స్థానంలో నిలిచి నివ్వెరపరిచింది. రెండో గ్రూపులోని 49 దేశాల్లో జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, రష్యా, చైనా, వెనిజులాలున్నాయి. నేపాల్ 92వ స్థానంలో నిలిచి ఈ గ్రూపులో చోటుదక్కించుకోడం విశేషం. మూడవ గ్రూపులోని 51 దేశాల్లో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లు క్యూ గట్టగా ఆఫ్ఘనిస్తాన్ అట్టడుగుకు చేరింది. ఆశ్చర్యం ఏమంటే మానవాభివృద్ధిలో ఎదురులేని క్యూబా, సంపద (జిడిపి) స్థానే ఆనందాన్ని (జిహెచ్‌పి) అభివృద్ధికి గీటురాయిగా లెక్కించుకొనే భూటాన్‌తో సహా 48 దేశాలకు ఈ నివేదికలో చోటే చిక్కలేదు. వాటి డేటా అందుబాటులో లేదట!

సహజంగానే తలసరి సంపద, ఆయుష్షు, స్వేచ్ఛ, శాంతి, అవినీతి రాహిత్యం, ప్రభుత్వాల మీద నమ్మకం, భవిష్యత్తు మీద భరోసా...ఇవన్నీ సంతోషానికి తూకపురాళ్ళుగా ఈ నివేదిక తీసుకుంది. దీనికోసం ప్రపంచ బ్యాంకు సుస్థిరాభివృద్ధి గణాంకాలను వాడుకుంది. మరోవైపు "సంతోషం అంటే జీవితంలోని తృప్తే" అంటుందీ నివేదిక. స్నేహ హస్తమందించడం, కలిసి మెలిసి జీవించడం, స్నేహితులను సమకూర్చుకోడం, ప్రేమగా పలకరించుకోడం, ఇతరుల్ని నమ్మడం, జీవితాన్ని ప్రేమించడం, నిస్పృహకు లోనుగాకుండడం, పరస్పరం పంచుకోవడం, ఉమ్మడితనం లాంటివన్నీ సంతోష హేతువులుగా లెక్కిస్తుంది. సామాజిక జీవితానికి పెద్ద పీట వేస్తుంది. శరణార్థుల్ని ఆదుకోమంటుంది. మరీ చిన్న కుటుంబాల్లో సంతోషం వుండదంటుంది. ఇంట్లో నలుగురైదుగురుండే లాటిన్ అమెరికా దేశాల్ని సంతోష ధామాలంటుంది. కోవిడ్ తర్వాత మనుషుల్లో మంచి మార్పు వచ్చిదంటుంది. స్థిమితపడ్డాక మళ్ళీ వెనక్కి పోతున్నామన్న శంకనూ లేవనెత్తుతుంది. ఇలాంటి గీటురాళ్ళ కోసం "గాలప్ వరల్డ్ పోల్" డేటాను ప్రమాణంగా తీసుకుంటుంది.

మన యువత ఒంటరిదై పోవడాన్ని అన్నిటికంటే ప్రధాన సమస్యగా ఈ నివేదిక పేర్కొంటుంది. మన యువకులు స్నేహం చేయడం మరిచిపోతున్నారట. సమాజానికి దూరంగా వుండిపోతున్నారట. వీరిలో నిస్పృహ పెరుగుతోందట. వ్యవస్థల పట్ల విశ్వాసం క్రమంగా సడలుతోందట. ఈ ధోరణి అమెరికాలోనూ, దక్షిణ కొరియాలోనూ మరీ తీవ్రంగా వుందట.

ఇంత చెప్పిన "ప్రపంచ సంతోష నివేదిక" సైన్సూ, సంపద వున్నంత మాత్రాన సంతోషంగా వున్నట్టు చెప్పలేమంటోంది. పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా ఎంతో ముందున్న అమెరికా, యూరపు దేశాలు సంతోషపరంగా వెనక్కి వెళుతున్నాయని హెచ్చరిస్తోంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయనీ అక్కడి లక్ష మరణాల్లో 23 ఆత్మహత్యలేననీ లెక్కేసి మరీ చెప్తోంది. ఈ దేశాల పురుషుల్లో, మధ్య వయస్కుల్లో నిస్పృహ, అభద్రతా పెరగడం ప్రమాదకరమంటోంది.

ఇక్కడితో ఈ నివేదిక ఆగలేదు. పారిశ్రామిక దేశాల్లో వస్తున్న రాజకీయ మార్పుల్ని, ఓటింగు సరళిని కూడా ఇది సంతోషంతో ముడిబెట్టింది. అక్కడ శరణార్థుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందట. ప్రపంచీకరణ అంటే ఏవగింపు వచ్చేసిందట. ఎన్నికల్లో సంప్రదాయ వ్యవస్థల పట్ల, పార్టీల పట్ల, సిద్ధాంతాల పట్ల నమ్మకం సడలిపోతోందట. కొత్త పార్టీలు వున్నట్టుండి పుట్టుకొస్తున్నాయట. తీవ్ర వామపక్షం వైపో, పచ్చి మితవాదం వైపో ఓటర్లు వొరిగిపోతున్నారట. బ్రెక్సిట్, ట్రంప్ విజయం, ఇటీవల జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్కు, ఫిన్లాండుల్లో వచ్చిన రాజకీయ మార్పులు ఈ అభద్రత వల్లా, ఈ అపనమ్మకం వల్లా వచ్చినవేనట!

ప్రపంచీకరణ, ఆటోమేషన్, వ్యాపారాల్లో అవినీతి సంప్రదాయ రాజకీయాల్ని కుదిపేస్తున్నాయట. జీవితంలో తృప్తి లేకపోవడమంటే ప్రజాస్వామ్యంలో నమ్మకం లేకపోవడమేనని ఈ నివేదిక విశ్లేషించడం పెద్ద హెచ్చరిక! ఈ ధోరణి ఒక సంస్కృతిగా మారడంతో ఇచ్చిపుచ్చుకోడాల్లో కూడా అభివృద్ధి చెందిన దేశాలు వెనకబడి పోతున్నాయనడం పెద్ద ప్రమాదసూచిక!

ఈ రిపోర్టు కొన్ని "భయాల్ని" కూడా ముందుకు తెచ్చింది. సంప్రదాయ విలువలు నానాటికి పలచబడిపోవడం, వ్యవస్థల మీద నమ్మకం సడలిపోవడం, ప్రపంచీకరణను జనం ఈసడించుకోవడం, వర్గ పోరాటాలు విస్తరించడం ఇవన్నీ ఈ "భయాల" కిందికి వస్తాయి! రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కూడా ఇంకా ఈ ధోరణి ఏమిటని ఈ నివేదిక నిర్వేదపడుతుంది! బెర్లిన్ గోడ పతనమయ్యాక కూడా ఇలా జరగడమేమిటని దిగాలు పడిపోతుంది. మరీ అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈ వాతావరణం కనిపించడమా అని హైరానా పడుతుంది.

అదే సమయంలో ఇంకో కోణం నుంచి చూస్తే మానవ చరిత్రలో మనం ఎప్పుడూ ఎరగనంత సంపన్నులం. విద్యావంతులం. ప్రపంచ జ్ఞానం వున్నవాళ్లం. ఏడాదికి 500 డాలర్ల సాయం ఆపన్నులకు అందిస్తున్న వాళ్ళం. ఎంత సంతోషాన్నైనా సంపాదించుకోగల స్తోమత వున్నవాళ్లం. దీన్నీ మరిచిపోరాదంటుందీ నివేదిక. కానీ విచిత్రమేమంటే నలుగురు కూర్చుని భోంచేయడం, పోగొట్టుకున్న పర్సును తిరిగి తెచ్చివ్వడం లాంటి వాటిని కూడా సంతోష సూచికలో చేర్చిన "ప్రపంచ సంతోష నివేదిక" జాతులకు జాతుల్నే నిర్మూలన చేస్తున్న యుద్ధాల గురించి మాట్లాడదు. జాతి విద్వేషాల గురించి ప్రస్తావించదు. అసమానతల్ని పట్టించుకోదు. సకల మానవ విలువల్నీ హరిస్తున్న కార్పొరేట్ సంస్కృతిని గురించి పెదవి విప్పదు. నానాటికి హరించుకుపోతున్న ఉపాధి గురించి నోరెత్తదు. చివరగా చెప్పుకోవలసింది మన దేశం గురించి! భారతదేశం 128వ స్థానం నుంచి 11 స్థానాలు ఎగబాక గల్గింది. అయితే ఎంత విశ్వగురు స్థానంలో వున్నా నేపాల్, పాకిస్తాన్లతో సహా 117 దేశాల కంటే దిగువ స్థానంలోనే వుండిపోయింది! కాకుంటే శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్‌లు మనకంటే మరీ వెనుకబడి వున్నాయి. దీంతో తృప్తిపడి సరిపెట్టుకుందామా? కొంచెం లోతుగా ఆత్మావలోకనం చేసుకుందామా? కనీసం ఆ నిజాయితీ అయినా మనకుందా? ఇవీ ప్రశ్నలు!

/ 'జన విజ్ఞానం' సౌజన్యంతో /

కవిత్వం

రాబందుల విందు

ఎప్పుడైనా, ఎక్కడైనా
ఎన్నడైనా, ఏ నాడైనా
విన్నారా...! ఈ విడ్డూరం
కన్నారా...! ఇలాంటి విచిత్రం
గొర్రెల్ని కాపు కాసే పని ఇక
పులులు తీసుకుంటాయట
జీవాల యోగ క్షేమాలను
కంటికి రెప్పలా, కాలికి చెప్పులా
కాపు కాసి, వాటికి భరోసా
కల్పించు పని ఇక పులులదేనట
జాతి వైరం మరచి పులులు
గొర్రెల క్షేమానికి
బాధ్యత వహించడం
రక్తం పీల్చే జలగలు
ముక్కు మూసుకుని
మూతి కట్టుకుని
సాధువుల మాదిరి పోజులివ్వడం,
గుంటనక్కలు ఏకంగా
అహింసా పరమోధర్మ:
అంటూ శాంతి మంత్రం పఠించడం
చేపల క్షేమం కొరకు కొంగలు
జప తపాలతో పొద్దుపుచ్చడం
అన్నీ విస్తు గొలిపే వింతలేమరి
అరచేతిలో వైకుంఠం
కట్టెతో కైలాసం మాదిరన్న మాట
నమ్మబుద్ధే కాదసలు
అప్పుడు 2020 స్వర్ణాంధ్రప్రదేశ్
ఇప్పుడు విజన్ 2047
నలభై ఏళ్ళ రాజకీయానుభవం
రంగరించి వండి వార్చిన
రాబందుల విందుభోజనం
అదే ఈ ఏటి ఉగాది ప్రవచనం
పి-4 పంచాంగం
గద్దల్ని, కోడి పిల్లలని ఒకే చోట
నిబ్బరంగా కలిపి వుంచుతామని
చెప్పే విజనరీ సోది పురాణం.

- వి. రాజగోపాల్,
విజయనగరం, సెల్ : 9133084262

అనకాపల్లికి ప్యూర్ విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారులలో ఒకటైన ప్యూర్ తాజాగా రాష్ట్రంలోని అనకాపల్లికి విక్రయాలను విస్తరించినట్లు తెలిపింది. ఇక్కడ శ్రీ సాయి లక్ష్మీ ఈ బైక్స్ షోరూంను ప్రారంభించినట్లు వెల్లడించింది. దాదాపు 750 చదరపు అడుగుల స్థలంలో విస్తరించి ఉన్న ఈ కొత్త షోరూం ద్వారా తమ కార్యకలాపాలను దేశంలో మరింత విస్తరించడానికి తోడ్పడుతుందని ప్యూర్ సిఇఒ అండ్ కో ఫౌండర్ రోహిత్ వదేరా పేర్కొన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ కింద వినియోగదారులకు రూ.5,000 విలువైన ఉచిత ఉపకరణాలు, పొడిగించిన వారంటీపై 50 శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు.

పాఠశాల విద్యాశాఖలో జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

జిల్లాలు	SA-LANG-I	SA-HINDI	SA-ENG	SA-MATHS	SA-PS	SA-BS	SA-SOCIAL	SA-PE	SGT	Total
శ్రీకాకుళం	37	11	65	33	14	34	70	81	113	458
విజయనగరం	14	14	23	8	32	20	62	63	210	446
విశాఖపట్నం	26	28	55	59	39	58	91	139	239	734
తూర్పుగోదావరి	65	78	95	64	71	103	132	210	423	1241
పశ్చిమ గోదావరి	42	61	84	40	40	64	103	181	420	1035
కృష్ణా	39	25	93	52	54	142	135	123	545	1208
గుంటూరు	42	57	69	35	58	86	109	166	521	1143
ప్రకాశం	39	23	95	94	24	70	106	72	106	629
నెల్లూరు	39	18	84	63	76	63	103	107	115	668
చిత్తూరు	38	17	104	30	29	63	130	86	976	1473
కర్నూలు	82	114	81	90	66	74	112	209	1817	2645
వైఎస్ఆర్ కడప	34	18	81	44	30	53	65	82	298	705
అనంతపురం	37	28	103	43	66	72	111	145	202	807
మొత్తం	**534**	**492**	**1032**	**655**	**599**	**902**	**1329**	**1664**	**5985**	**13192**

పెరిగిన విదేశీ మారకం నిల్వలు

ముంబయి : ఏప్రిల్ 11తో ముగిసిన వారంలో భారత విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ఈ సమీక్షా వారంలో 1.567 బిలియన్ డాలర్లు పెరిగి 677.835 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్‌బిఐ వెల్లడించింది. వరుసగా ఆరో వారం విదేశీ మారక ద్రవ్యం నిల్వల్లో పెరుగుదల చోటు చేసుకుందని ఆర్‌బిఐ తెలిపింది. ఏప్రిల్ 4తో ముగిసిన గత వారంలో ఫారెక్స్ నిల్వలు 10.872 బిలియన్లు పెరిగి 676.268 బిలియన్లుగా నమోదయ్యాయి.

గెలాక్సీ ఎం56 5జి విడుదల

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎం56 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. 8జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.27,999గా ప్రకటించింది. ఏప్రిల్ 23 నుంచి అమ్మకాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది.

శ్రీవారి సేవలో నటి సమంత

ప్రజాశక్తి -తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సందర్శించారు. టిటిడి ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. టిటిడి డిక్లరేషన్‌పై సంతకం చేసి అనంతరం ఆమె స్వామివారిని దర్శించుకున్నారు.

బిసిల వెన్ను విరిచిన చంద్రబాబు

- వైసిపి బిసి విభాగ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిసిల వెన్ను విరిచిన ఘనుడని, జగన్ హయాంలోనే వారికి న్యాయం జరిగిందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బిసి విభాగ సమావేశం శనివారం జరిగింది. మహాత్మా జ్యోతిభాపూలే, మాజీ సిఎం వైఎస్ఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతపురంలో హత్యకు గురైన కురుబ లింగమయ్యకు సంతాపం ప్రకటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సజ్జల మాట్లాడుతూ.. సామాజికంగా జగన్ బిసిలకు వెన్నుదన్నుగా నిలిచారని పేర్కొన్నారు. కూటమి పార్టీలు మాత్రం వారి ఆత్మ గౌరవాన్ని కాలరాస్తున్నాయని తెలిపారు. కూటమి దౌర్భాగ్య పాలనపై బిసిలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులు నియంతృత్వ విధానాలతో ఆర్గనైజ్డ్ నేరాలు చేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని తెలిపారు. బిసి మేయర్‌ను పదవి నుండి తప్పించారని పేర్కొన్నారు. బలం లేకపోయినా ప్రలోభాలకు గురిచేస్తున్నారని, బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ.. కూటమి పాలనలో అణగారిన వర్గాలపై అరాచకాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. బిసిలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా చూస్తే.. జగన్ వెన్నెముకలా భావించారని తెలిపారు. బిసి సెల్ వర్కింగు ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ.. కూటమి పార్టీలకు బిసిల సత్తా ఏమిటో చూపించాలని తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పూలే ఆశయాలను జగన్ కొనసాగించారని తెలిపారు.

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి మోసాలను బయటపెట్టాలని కోరారు. మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. జగన్ పాలనలో బిసిలు ఆత్మగౌరవంతో బతికారని, నేడు భయంతో బతుకుతున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు లేళ్ల అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.12,630 కోట్ల లాభాలు

ముంబయి : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18 శాతం వృద్ధితో రూ.12,629 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10,708 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2024-25 తుది డివిడెండ్ కింద రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.11 డివిడెండ్ చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీనికి కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో ఆమోదం లభించాల్సి ఉంటుంది. 2024-25లో స్థూల నికర లాభాలు 15.5 శాతం పెరిగి రూ.47,227 కోట్ల నికర లాభాలు సాధించింది.గడిచిన క్యూ4లో ఐసిఐసిఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 11 శాతం పెరిగి రూ.21,193 కోట్లకు చేరింది. డిపాజిట్లు 11.4 శాతం పెరిగి రూ.14,86,635 కోట్లకు చేరాయి. 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.67 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయం నాటికి 2.16 జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 0.42 శాతంగా ఉన్న నికర ఎన్‌పిఎలు.. గడిచిన మార్చి ముగింపు నాటికి 0.39 శాతానికి తగ్గాయి.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి

- 'సోలార్' భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-కదిరి టౌన్

హంద్రీనీవా లైనింగ్ పనులను తక్షణమే ఆపాలని, నంబులపూలకుంట మండలంలో సోలార్ కంపెనీల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పి.కుంట మండలంలో భూములు కోల్పోతున్న గ్రామాల్లో ఎపి రైతు సంఘం బృందం రెండు రోజుల పాటు పర్యటించింది. ఈ పర్యటన అనంతరం కదిరి పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్నతో కలిసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యల్ప వర్షపాతం, కరువు.. కాటకాలకు నిలయంగా ఉన్న జిల్లాల్లో తాగు, సాగుకు ప్రధాన నీటి వనరు హంద్రీనీవా అని అన్నారు. జిల్లా అవసరాలకు తగ్గట్టుగా నీటిని కేటాయించకపోగా ప్రధాన కాలువను కాంక్రీట్ లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని తెలిపారు. బోర్లను నమ్ముకొని, వాణిజ్య పంటలపై ఆధారపడే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి కాలువను వెడల్పు చేసి, పిల్ల కాలువల ద్వారా చెరువులన్నింటినీ నీటితో నింపాలన్నారు.

ఎన్‌పి.కుంట, మడకశిర, రొద్దం, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ కోసం సుమారు 30 వేల ఎకరాలు సేకరిస్తున్నారని తెలిపారు. వాటి ద్వారా కార్పొరేట్లకు లాభాలు, రైతులకు నష్టాలు మిగులుతాయన్నారు. రైతుల ఆమోదం లేని సోలార్ కోసం చేస్తున్న భూసేకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మామిడి తోట రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. పంట రుణాలను రెన్యువల్ చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మేరకు ఎకరాకు రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీరో బ్రోకరేజ్‌తో అపరిమిత ట్రేడింగ్

- స్టాక్‌కార్ట్ కొత్త ప్లాన్ విడుదల

న్యూఢిల్లీ : ఇన్వెస్టర్లకు జీరో బ్రోకరేజ్ ట్రేడింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు డిస్కౌంట్ బ్రోకరేజ్ ప్లాట్‌ఫామ్ అయిన స్టాక్‌కార్ట్ సిఇఒ ప్రణయ్ అగర్వాల్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్మార్ట్‌ట్రేడర్ ప్లాన్‌ను ప్రారంభించామన్నారు. ఇది సరసమైన ధరలకు వ్యాపారం చేయాలనుకునే క్రియాశీల వ్యాపారుల కోసం రూపొందించబడిందన్నారు. ఒక సంచలనాత్మక జీరో బ్రోకరేజ్ సబ్‌స్క్రిప్షన్ ఆధారిత ఆఫర్ అని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌లో నెలకు రూ.99, లేదా ఏడాదికి రూ.699 చెల్లించడం ద్వారా అపరిమిత లావాదేవీలు జరుపుకోవచ్చన్నారు.

అంతర్జాతీయ స్థాయి పర్యాటక హబ్‌గా బారువ

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- సముద్రంలోకి ఆలివ్ రిడ్లీ తాబేళ్ల విడుదల



ప్రజాశక్తి- సోంపేట (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని బారువా బీచ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బీచ్ ఉత్సవం సందర్భంగా ఆలివ్ రిడ్లీ తాబేళ్లను శనివారం సముద్రంలోకి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు తాబేళ్ల పరిరక్షణపై శిక్షణ ఇచ్చి, ప్రకృతి సమతుల్యత కాపాడే విధంగా వారిని భాగస్వాముల్ని చేస్తున్నామని అన్నారు. భారత నౌకాదళానికి చెందిన బలరాం మాట్లాడుతూ బారువా సముద్రతీరంలో మునిగిపోయిన 75 మీటర్ల పొడవైన ఓ నౌక చుట్టూ అద్భుతమైన సముద్ర జీవరాశి ఉందన్నారు. కెప్టెన్ సూర్య మాట్లాడుతూ బారువా వాతావరణం వాయు, జల క్రీడలకు ఎంతో అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో వరిమీ కంపోస్టు, వ్యర్థాలను విద్యుత్‌గా మారుస్తున్న ప్రాజెక్టులు, ఆలివ్ రిడ్లీ తాబేళ్లపై పోస్టర్లు, చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

కర్నూలు క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అధునాతన వైద్య సేవలు

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వసతులు అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.28 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలరేటర్, రూ.2.5 కోట్ల విలువైన ఇతర రోగ నిర్ధారణ పరికరాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ ఆంకాలజీ వార్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్‌తో కలిసి సత్య కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో లేని అత్యాధునిక క్యాన్సర్ చికిత్సను కర్నూలులో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని, మూడు నెలల్లో రూ.45 కోట్ల విలువైన అధునాతన పరికరాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చామని తెలిపారు. కర్నూలు క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి కూడా రోగులు చికిత్స పొందుతున్నారని అన్నారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో రూ.20 లక్షల వరకు ఖర్చయ్యే వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ఆయన సూచించారు. కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, పార్థసారథి, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి



మీకోసం

కళ్లకింద నలుపు పోవాలంటే బంగాళాదుంపలను చిన్న ముక్కలుగా కోసి, కళ్లకింద పెట్టుకోవాలి.

జీవన సౌరభం

ఆలోచనలు ఎల్లప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఎందుకంటే అవి మాటల్లో ప్రతిబింబిస్తాయి.

JEEVANA జీవన the family

అమ్మమ్మ ప్రశ్నలు - మనవడి జవాబులు



శివ ఐదవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లాలంటే రోజూ మొండికేసేవాడు. మారాం చేస్తున్న శివని బడికి పంపాలంటే వాళ్ళ అమ్మకు తల వాచిపోయేది. ఒకసారి శివ వాళ్ల అమ్మమ్మ, శివ ఇంటికి వచ్చింది. ఈ వ్యవహారాన్ని గమనించింది.

సాయంత్రం శివ పాఠశాల నుండి రాగానే అమ్మమ్మ దగ్గరకు తీసుకుని ముద్దు చేస్తూ కొన్ని ప్రశ్నలు వేసింది. 'నీకు పాలు ఇష్టమా?' అంది. 'నాకు పాలు చాలా ఇష్టం' అన్నాడు శివ. 'పెరుగు?' అంది. 'పెరుగు అంటే చాలా చాలా ఇష్టం' అన్నాడు.

'పెరుగు ఎలా తయారౌతుంది?' అడిగింది అమ్మమ్మ. 'పాలను బాగా మరిగించి అందులో కొంచెం మజ్జిగ వేస్తే పెరుగౌతుంది. అది కూడా తెలియదా' అన్నాడు శివ. 'సరే వెన్న ఎలా వస్తుంది?' మరో ప్రశ్న వేసింది. 'మీగడ పెరుగును బాగా చిలకడం వల్ల వెన్న వస్తుంది. అమ్మ అప్పుడప్పుడు వెన్న తీస్తుందిగా' అన్నాడు. 'మరి నెయ్యి?' అంది. 'వెన్నను వేడి చేయడం వల్ల నెయ్యి వస్తుంది'.

'సమాధానాలు బాగా చెప్పావు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యిలో దేని విలువ ఎక్కువ?' అడిగింది అమ్మమ్మ. 'నెయ్యి విలువ ఎక్కువ' తడుముకోకుండా సమాధానం చెప్పాడు శివ. 'ఎందుకు నెయ్యి విలువ ఎక్కువ?' అడిగింది. 'ఎందుకంటే పాలను మరగపెట్టి పెరుగును, పెరుగును చిలికి చిలికి వెన్నను, వెన్నను బాగా కాచితే నెయ్యి వస్తుంది కాబట్టి' అన్నాడు. 'ఎంత బాగా చెప్పావో!' అని మనవడిని దగ్గరకి తీసుకుంటూ, 'పెద్దైన తర్వాత నువ్వేం కావాలనుకుంటున్నావ్' అడిగింది అమ్మమ్మ. 'నేనూ... నేనూ... పైలట్'. చేతులు కింది నుంచి విమానం పైకి లేచేటట్టు లేపుతూ అన్నాడు శివ. 'ఓ... పైలెట్ అవుతావా? చాలా మంచి ఉద్యోగం' అని ఉత్సాహపరిచింది. 'పైలెట్ కావాలంటే ఏం చేయాలి' మరలా ప్రశ్నించింది అమ్మమ్మ. 'బాగా చదువుకోవాలి' హుషారుగా చెప్పాడు శివ. 'మరి నువ్వు బాగా చదువుతున్నావా?' అమ్మమ్మ ప్రశ్నకు నీళ్లు నమిలాడు శివ. 'పాలు నుండి కమ్మనైన నెయ్యి రావాలంటే ఎంతో శ్రమ చేయాలి. అలాగా చదువు కూడా! నీకిష్టమైన పైలట్ ఉద్యోగం చేయాలంటే ముందు నువ్వు బాగా చదువుకోవాలి. సరేనా! అంది అమ్మమ్మ. 'ఇప్పటినుండి నేను రోజూ బడికి వెళ్లి బాగా చదువుకుంటాను అమ్మమ్మ' అన్నాడు శివ.

- ఆవుల చక్రపాణి యాదవ్,
కర్నూలు,
99633 50973.

నేను గీసిన బొమ్మ





పచ్చవ బిందు సహస్ర,
6వ తరగతి,
నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
నరసరావు పేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అనాథలకు అంతిమ సేవకుడు

'ఒక్కడై రావడం.. ఒక్కడై పోవడం వెంట ఏ బంధము.. రక్త సంబంధము తోడుగా రాదుగా తుది వేళా మరణమనేది ఖాయమని మిగిలెను కీర్తి కాయమని' అంటూ సాగే ఈ పాట 'ఆ నలుగురు' సినిమాలో చైతన్యప్రసాద్ రాసింది. అనాథలంటే ఎవ్వరూ పట్టించుకోరు. అలాంటివి వారు చనిపోతే ఎవ్వరూ దగ్గరకు కూడా రారు. పద్దెనిదేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనతో చలించిపోయిన అంబేద్కర్ అనాథ శవాలకు అంతిమయాత్రికుడుగా మారాడు. అతడు కేవలం డ్రైవర్ మాత్రమే. నిరుపేద కుటుంబం అయినా ఆ వృత్తిద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించుకుంటూనే ప్రవృత్తిగా అనాథ శవాలకు కొంతమేర సొంత డబ్బు వెచ్చిస్తూ ప్రవృత్తిగా సామాజిక సేవ చేస్తున్నాడు.



కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన కూపర్ వెంకటరత్నం, కస్తూరిభాయి దంపతులకు ముగ్గురు సంతానంలో రెండో కుమారుడు అంబేద్కర్. తండ్రి జగన్నాథపురం బోట్ యార్డులో పనిచేశారు. పదో తరగతి వరకూ చదువుకున్న అంబేద్కర్ ఆ తర్వాత పేదరికం కారణంగా చదువుకు స్వస్తి చెప్పి తనకు ఇష్టమైన డ్రైవింగ్‌ను నేర్చుకుని అదే వృత్తిగా కొనసాగిస్తూ జీవిస్తున్నారు. భార్య లక్ష్మితోపాటుగా ఇద్దరు కుమారులు లోకేష్, ఆకాష్ ఉన్నారు. కాకినాడకు చెందిన మాజీ ఎంపి ఎంఎం పల్లంరాజు తాతయ్య పంతం రామస్వామి వద్ద ఆయన మొదట్లో కారు డ్రైవర్‌గా చేరారు. ఓ రోజు తాను అద్దెకు ఉండే ఇంటి సమీపంలో ఓ యాచకుడు చనిపోగా, ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లింది. తరువాత మున్సిపల్ సిబ్బంది చెత్త ట్రాక్టర్‌లో ఎక్కించి తీసుకెళ్లారు. ఆ దృశ్యాన్ని చూసిన అంబేద్కర్ కన్నీటి పర్యంతమయ్యారు.

ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. నా అనే ఎవ్వరూ లేని అనాథ శవాలకు అంత్యక్రియలు చేయటం బాధ్యతగా ఎంచుకున్నారు. దీనికోసం 2007లో రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీగా ఉన్న డాక్టర్ దుర్గరాజును కలిసి 'ఆత్మబంధువు' పేరుతో మృతదేహాల తరలింపు వాహనం నడిపే ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి 2017 వరకూ రెడ్‌క్రాస్‌లోనే పనిచేశారు. వందలాది మంది అనాథల అంత్యక్రియలు పూర్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు.

పలువురి ప్రోత్సాహం ఇలా ...

2017 నుంచి కాకినాడకు చెందిన కండిబోయిన ధర్మరాజు నిర్వహిస్తున్న కండిబోయిన వారి శ్రీ స్వచ్ఛంధ సేవా సంస్థలో చేరారు. అక్కడ పంతం రామస్వామి సోదరుడి కుమారుడు పంతం నెహ్రూ కృషితో 'మహాప్రస్థానం' వాహనం నడుస్తోంది. నాటి నుంచి నేటి వరకూ అదే సంస్థలో కొనసాగుతున్నారు. అక్కడ వాహనం నడవటంతోపాటు పూర్తిస్థాయిలో అనాథ మృతదేహాలను మోసుకెళ్లటం, తరలించడం వంటి పనులు కూడా చేస్తున్నారు. కుళ్లి, శరీర భాగాలు తెగిపోయిన మృతదేహాల నుంచి గుర్తు తెలియని మృతదేహాల వరకూ, అందరూ ఉండి కూడా కుటుంబ సభ్యుల ఆదరణ లేని దేహాల నుంచి ఎవరూ లేని అనాథల వరకూ స్వయంగా అతడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. 2007 నుంచి ఇప్పటివరకూ 1153 అనాథ మృతదేహాలను కాటికి తరలించారు. వందలాది మందికి తలకొరివి కూడా అతడే పెట్టేవారు. భానుగుడికి చెందిన పూలకొట్టు వెంకటేశ్వరరావు ఉచితంగా పూలు, దండలు సమకూర్చేవారు. పోలీసు వారు బాగా సహకరించటంతో ఈ క్రతువులను ఆయన పూర్తి చేయగలుగుతున్నామని అంబేద్కర్ చెప్పారు.

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ...

కరోనా రెండు దఫాల్లో మృతి చెందిన అనాథలు, యాచకులు 170 మందికి అంబేద్కర్ అంత్యక్రియలు చేశారు. మృత దేహాలను తాకడం ప్రమాదమని తెలిసినా భుజంపై మోసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. తనకు, కుటుంబ సభ్యులకు కూడా కోవిడ్ వచ్చినా తట్టుకొని ఆ తర్వాత ఇదే కృషిని కొనసాగించారు. కరోనా సమయంలో అయినా వారు పట్టించుకోని పరిస్థితుల్లో 'మీకు నేనున్నా'నంటూ ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించేవారు. పూడ్చడమైనా, దహనమైనా తన చేతులతోనే చేస్తుంటాడు. 2007 నుంచి నేటి వరకూ బస్టాపులు, రోడ్ల కూడళ్లు, రైల్వే స్టేషన్ ఇతరత్రా ప్రాంతాల్లో ఎక్కడ అనాథలు చనిపోయినా పోలీసు శాఖ వారు సైతం అంబేద్కర్‌నే పిలిపిస్తుంటారు. రోజుకు నాలుగైదు భౌతికకాయాలకు అంత్యక్రియలు జరిపిన రోజులు కూడా ఉన్నాయి. కోవిడ్ మొదటి దఫాలో డొక్కా సీతమ్మ ట్రస్ట్ ద్వారా రామకృష్ణ, గోపాలకృష్ణ కూడా అంబేద్కర్‌కు సహకరించారు. కండిబోయిన వారి శ్రీ స్వచ్ఛంధ సేవా సంస్థ సభ్యులు సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు కుడిపూడి నాగరమేష్, సభ్యులు వాసంశెట్టి రాజేశ్వరరావు, కాకినాడ అంబులెన్స్ యజమాని నామాల శ్రీను, ఫస్ట్‌క్లాస్ జడ్జి దొమ్మేటి సుధాకర్ ప్రోత్సహించారు. హెచ్ఐవి, సైన్‌ఫ్లు, ఇతర వైరస్‌లు వ్యాపించి చనిపోయిన వారికి కూడా అంబేద్కర్ దహన సంస్కారాలు చేశారు.

అంతిమ సంస్కారమే సేవగా....



గత 18 సంవత్సరాలుగా అనాథలకు అంత్యక్రియలు చేయటం ఎంతో సేవగా భావిస్తున్నా. అనాథలతోపాటుగా సమాజంలో అందరూ ఉండి కూడా కొందరు అంత్యక్రియలకు ముందుకు రానివారికి కూడా నా వంతుగా సహాయం చేస్తున్నా. మామూలుగా వ్యక్తులకు ఏవిధంగా పూలదండలు, పూలు వేసి గౌరవంగా అంత్యక్రియలు చేస్తామో అనాథలకు కూడా అలాగే నిర్వహిస్తారు. ఇలాంటి సేవల కోసం నా సెల్ : 9347878713, 8498874684కు సంప్రదించవచ్చు.

- కూపర్ భాను అంబేద్కర్

సమాచారం ఇస్తే చాలు

అనారోగ్యంతో బాధపడే అనాథలను రాజమండ్రి, అమలాపురం, కోరుకొండ, తాళ్లరేవు, కోరంగి, ఏలేశ్వరం, రంపచోడవరం, అడ్డతీగల, యానాం, అన్నవరం, తుని, పిఠాపురం వంటి ప్రాంతాల నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో 108 ద్వారా చేర్పిస్తుంటారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిన వారి అనాథ శవాల అంత్యక్రియల నిమిత్తం పోలీసు ఎంక్వయిరీ పూర్తయిన తర్వాత అంబేద్కర్‌కు సమాచారం ఇస్తుంటారు. అంబేద్కర్ వెళ్లి స్థానిక శ్మశాన వాటికల్లో కార్యక్రమాలు పూర్తి చేస్తారు. శుక్రవారం నాడు కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గేటు ఎదుట 45 ఏళ్ల పైబడిన ఓ అనాథ వ్యక్తి మృతదేహం పడివుంది. పోలీసువారి సహకారంతో వాహనం క్లీనర్ కృష్ణార్జున సహకారంతో అంబేద్కర్ భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

సేవలకు ప్రశంసలు

అనాథ మృతదేహాలను అక్కున చేర్చుకుని అంత్యక్రియలు చేస్తున్న అంబేద్కర్‌ను ప్రస్తుత కాకినాడ కలెక్టర్ సాగిలి షన్మోహన్ అభినందించి ప్రోత్సహిస్తున్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గోపాలకృష్ణ ద్వివేది, పూర్వపు డిజిపి గౌతమ్ సవాంగ్ తదితరుల మన్ననలు పొందారు. వారు పురస్కారాలు, అవార్డులు ఇచ్చి సత్కరించారు. రూ.25 వేలు నగదు బహుమతి కూడా అందజేశారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పేదల ఇళ్లపై బుల్డోజర్

- సిపిఎం అండతో అడ్డుకున్న ప్రజలు
- మహిళలపై మగ పోలీసుల దౌర్జన్యం
- ప్రతిఘటనతో వెనక్కి తగ్గిన అధికార యంత్రాంగం



సిపిఎం నేత జక్కంశెట్టి సత్యనారాయణను అరెస్టు చేసి తరలిస్తుండగా జీపును అడ్డుకున్న పేదలు

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా మండల కేంద్రమైన పాలకోడేరు శివార స్థానిక ఎఎస్ఆర్ నగర్‌లో ఇరిగేషన్ కాలువ గట్టున ఉన్న ఇళ్ల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. పేదలు, సిపిఎం నాయకుల అడ్డగింపుతో పోలీసులు, అధికారులు వెనుదిరిగారు. 1986 నుంచి 130 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయి. వీరిలో 35 కుటుంబాలకు ప్రభుత్వ లే అవుట్లలో స్థలాన్ని చూపించినప్పటికీ కోర్టు కేసు నడుస్తుండటంతో పేదలకు ఆ స్థలాలు ప్రభుత్వం స్వాధీనం చేయలేదు. అయితే అభివృద్ధి, కాలువల ప్రక్షాళన, కాలుష్యం పేరుతో ఇరిగేషన్, పేదల ఇళ్ల తొలగింపునకు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల పేరుతో ఎటువంటి ప్రత్యామ్నాయమూ చూపించకుండానే ఇళ్లు తొలగించేందుకు శనివారం ఉదయమే పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతోపాటు పోలీసులు భారీగా మొహరించారు. మూడు బుల్డోజర్లతో ఇళు తొలగించేందుకు పోలీసు బందోబస్తు నడుమ అధికార యంత్రాంగం ముందుకు కదిలింది. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యతోపాటు నిరుపేదలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే జెసిబిలు నిలుపుదల చేయకుండా ముందుకు కదిలించడంతో పేదలంతా పెట్రోల్ సీసాలతో నేలపై బైఠాయించారు. ఇళ్లు తొలగించాలని చూస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో పోలీసులు, నిరుపేదల మధ్య వాగ్వివాదం ప్రారంభమై తోపులాటకు దారి తీసింది. మహిళలని చూడకుండా మగ పోలీసులు ఇష్టానుసారం చేతులేసి లాగే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది. అయినా పేదలు వెనక్కి తగ్గకపోవడంతో అగ్నిమాపక వాహనం ద్వారా వాటర్ గన్స్‌తో నీళ్లు చిమ్మే ప్రయత్నం చేయగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని నిరుపేదలు హెచ్చరించడంతో వెనక్కు తగ్గారు. దీంతో ఆ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణను అరెస్ట్ చేసి తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. బాధిత ప్రజలందరూ పోలీసు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు సత్యనారాయణను విడిచిపెట్టారు. సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్యను కూడా అరెస్టు చేసి తీసుకెళ్తున్న క్రమంలో పేదలు అడ్డుకుని ప్రతిఘటించారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరుపేదలకు మధ్య జరిగిన ఘర్షణలో స్థానికంగా ఉన్న కల్వర్టుపై నాగవరపు ఈశ్వరి పడడంతో ఆమె తలకు గాయమైంది. దీంతో హుటాహుటిన భీమవరం ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మరో ఏడుగురు తోపులాటలో అస్వస్థతకు గురయ్యారు. వారిని పాలకోడేరు పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు, అధికారులు వెనక్కి తగ్గి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే అహంకార పూరిత పాలనను అడ్డుకుంటాం : సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఉండి ఎమ్మెల్యే అహంకారపూరిత, దుర్మార్గ పాలనను అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఎఎస్ఆర్ నగర్‌లో ఆయన శనివారం సాయంత్రం పర్యటించి బాధిత ప్రజలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ.. ఈ మూడు నెలల కాలంలోనే నియోజకవర్గంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న కొన్ని వందల కుటుంబాల పేదల ఇళ్లను అక్రమంగా తొలగించారన్నారు. పాలకోడేరులో ఎఎస్ఆర్ నగర్ 1986లో వరదల సమయంలో ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ కాలనీకి అన్ని సౌకర్యాలనూ కల్పించిందని గుర్తు చేశారు.

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు వెల్లువ

పేదలపై దాడిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన భీమవరంలోని ప్రకాశం చౌక్‌లో నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ.. దాడిలో మహిళలు, వృద్ధులు, పిల్లలు కూడా గాయాల పాలవ్వడం అత్యంత బాధాకరమన్నారు. కాళ్ల మండలం బొండాడ సెంటర్, ఉండి మెయిన్ సెంటర్, ఆచంట మార్కెట్ సెంటర్, ఆకివీడులో దొరగారి చెరువు సెంటర్, పెనుమంత్ర మండలం బ్రాహ్మణచెరువు సెంటర్‌లలో నిరసన తెలిపారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్య



ప్రజాశక్తి - తగరపువలస (విశాఖపట్నం)

విశాఖపట్నంలో మెడికల్ కళాశాల భవనం పై నుంచి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. తోటి విద్యార్థులు, మతుని కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో శీరం దత్ ప్రణీత్ (22) నాలుగో సంవత్సరం చదువుతున్నారు. కళాశాల సప్లిమెంటరీ పరీక్షలు కళాశాలలో జరుగుతున్నాయి. పరీక్ష ప్రారంభంలోనే ఒఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్ తీసుకున్నారు.

పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వాలన్న అభ్యర్థనను యాజమాన్యం తిరస్కరించిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన విద్యార్థి కళాశాల భవనం పై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. యాజమాన్యం వేధింపులే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సహచర విద్యార్థులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీ లించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు డిమాండ్ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే గంటా

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కళాశాలకు వెళ్లి ఘటన పూర్వపరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. కారణాలు వెల్లడైన తర్వాత బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

బాదేసిన బట్లర్

గుజరాత్ రికార్డు ఛేదన
ఢిల్లీపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు



అహ్మదాబాద్: ఐపిఎల్ సీజన్-18లో గుజరాత్ టైటాన్స్ జట్టు భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డు నెలకొల్పింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 204పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. జోస్ బట్లర్(97నాటౌట్; 54బంతుల్లో 11ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు చివర్లో తెవాటియా(11నాటౌట్; 3బంతుల్లో, ఫోర్, సిక్సర్) మ్యాచ్‌ను ముగించాడు. ఆఖరి ఓవర్లో గుజరాత్ విజయానికి 6 బంతుల్లో 10 పరుగులు అవసరం కాగా... మిచెల్ స్టార్క్ విసిరిన ఆ ఓవర్లో తెవాటియా వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి గుజరాత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. గత మ్యాచ్‌లో క్లిష్ట పరిస్థితుల్లో స్టార్క్ సూపర్ ఓవర్‌లో జట్టు విజయానికి కారకుడు కాగా.. నేడు ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయాడు. తెవాటియా అతడికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ఐపిఎల్ చరిత్రలో గుజరాత్ జట్టు ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఇదే తొలిసారి. 204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (7) త్వరగా రనౌట్ అయ్యాడు. అయితే, మరో ఓపెనర్ సాయి సుదర్శన్ (36; 21 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్) మెరుపు షాట్లతో స్కోరు బోర్డును పరుగెత్తించాడు. సుదర్శన్ ఔటయ్యాక, క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఒంటరి పోరాటం చేశాడు. అతనికి రూథర్‌ఫోర్డ్ (43; 34 బంతుల్లో, ఫోర్, 3సిక్సర్లు) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. రూథర్‌ఫోర్డ్ ఔటైన తర్వాత, రాహుల్ తెవాటియా తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు, టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఢిల్లీ బ్యాటర్లలో కెప్టెన్ అక్షర్ పటేల్ (39; 32 బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు), చివర్లో మెరుపులు మెరిపించిన అశుతోష్ శర్మ (37; 19 బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వీరితో పాటు ట్రిస్టన్ స్టబ్స్ (31), కరుణ్ నాయర్ (31), కేఎల్ రాహుల్ (28) కూడా రాణించడంతో ఢిల్లీ భారీ స్కోరు చేయగలిగింది. గుజరాత్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, అర్షాద్ ఖాన్, సాయి కిషోర్, ఇషాంత్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బట్లర్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు...

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: అభిషేక్ పోరెల్ (సి)సిరాజ్ (బి)అర్షాద్ ఖాన్ 18, కరణ్ నాయర్ (సి)అర్షాద్ ఖాన్ (బి)ప్రసిధ్ 31, రాహుల్ (ఎల్‌బి)ప్రసిధ్ 28, అక్షర్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ 39, స్టబ్స్ (సి)ప్రసిధ్ (బి)సిరాజ్ 31, అషుతోశ్ శర్మ (సి)లోమ్రోర్ (బి)సాయి కిషోర్ 37, విప్‌రాజ్ నిగమ్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ 0, ఫెర్రిరో (సి)సాయికిషోర్ (బి)ఇషాంత్ 1, స్టార్క్ (నాటౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 4, అదనం 12. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 203పరుగులు.

వికెట్ల పతనం: 1/23, 2/58, 3/93, 4/146, 5/173, 6/176, 7/191, 8/199

బౌలింగ్: సిరాజ్ 4-0-47-1, అర్షాద్ ఖాన్ 4-0-46-1, ప్రసిధ్ 4-0-41-4, రషీద్ ఖాన్ 4-0-38-0, ఇషాంత్ 3-0-19-1, సాయి కిషోర్ 1-0-9-1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)స్టబ్స్ (బి)కుల్దీప్ 36, శుభ్‌మన్ గిల్ (రనౌట్) కరణ్ నాయర్ 7, బట్లర్ (నాటౌట్) 97, రూథర్‌ఫోర్డ్ (సి)స్టార్క్ (బి)ముఖేశ్ కుమార్ 43, తెవాటియా (నాటౌట్) 11, అదనం 10. (19.2ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 204పరుగులు.

వికెట్ల పతనం: 1/14, 2/74, 3/193 **బౌలింగ్:** స్టార్క్ 3.2-0-49-0, ముఖేష్ కుమార్ 4-0-40-1, అక్షర్ పటేల్ 2-0-18-0, విప్‌రాజ్ నిగమ్ 4-0-34-0, కుల్దీప్ 4-0-30-1, మోహిత్ శర్మ 2-0-28-0.

గుజరాత్ అత్యధిక పరుగుల ఛేదనలు

204 : ఢిల్లీపై, అహ్మదాబాద్‌లో 2025
198 : బెంగళూరుపై, బెంగళూరులో 2023
197 : రాజస్తాన్‌పై, జైపూర్‌లో 2024
196 : సన్‌రైజర్స్‌పై, ముంబయిలో 2022
190 : పంజాబ్‌పై, బ్రాబౌర్న్‌లో 2022

ఐపిఎల్‌లో నేడు

పంజాబ్ కింగ్స్ × బెంగళూరు
వేదిక: ఛండీగఢ్; మ.3.30గం॥లకు

ముంబయి ఇండియన్స్ × చెన్నై సూపర్‌కింగ్స్
వేదిక: ముంబయి; రా.7.30గం॥లకు

వారేవ్వా.. ఆవేశ్ ఖాన్

- చివరి బంతికి నెగ్గిన లక్నో
- గెలుపు ముంగిట రాజస్తాన్ బోల్తా



జైపూర్: రాజస్తాన్ రాయల్స్-లక్నో సూపర్‌జెయింట్స్ జట్ల మధ్య చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో జట్టు గెలిచింది. చివరి ఓవర్లో విజయానికి 9పరుగులు చేయాల్సిన రాజస్తాన్ జట్టు కేవలం 6పరుగులే చేసి చేజేతులా ఓటమిపాలైంది. ఆ ఓవర్ వేసిన ఆవేశ్ ఖాన్ అద్భుతం చేశాడు. తొలి రెండు బంతులకు మూడు పరుగులు ఇచ్చినా.. ఆ తర్వాత బంతికి హెట్‌మైర్‌ను ఔట్ చేశాడు. నాల్గో బంతికి పరుగులేమీ ఇవ్వకున్నా... ఐదో బంతికి రెండు పరుగులే ఇచ్చాడు. ఇక చివరి బంతికి 4పరుగులు చేయాల్సిన రాజస్తాన్‌ను.. శుభమ్ దూబే కొట్టిన బంతిని అద్భుతంగా అడ్డుకొని మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. దీంతో ఒక్క పరుగే రావడంతో లక్నో ఫీల్డర్లు సంబరాల్లో మునిగారు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో శనివారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 180పరుగులు చేసింది. ఛేదనలో రాజస్తాన్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్ల నష్టానికి 178పరుగులు చేసి ఓటమిపాలైంది. లక్నో జట్టులో మార్‌క్రమ్(66), ఆయుష్ బడోని(50) అర్ధసెంచరీలతో రాణించగా.. రాజస్తాన్ బౌలర్లు హసరంగకు రెండు, ఆర్చర్, సందీప్ శర్మ, దేశ్‌పాండేలకు ఒక్కో వికెట్ దక్కాయి. ఇక రాజస్తాన్ జట్టులో ఓపెనర్ జైస్వాల్(74) సూపర్ ఇన్నింగ్స్‌కి తోడు రియాన్ పరాగ్(39), 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. కేవలం 20 బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 34పరుగులు చేసి మార్‌క్రమ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. లక్నో బౌలర్లు ఆవేశ్ ఖాన్‌కు మూడు, శార్దూల్, మార్‌క్రమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆవేశ్ ఖాన్‌కు దక్కింది.

పిఎంశ్రీకి నిధులేవి?

- 3 రాష్ట్రాలకు మొండిచేయి
- 17 రాష్ట్రాలకు కేటాయింపుల్లో 25 శాతంలోపే విడుదల
- స్కీమ్‌లో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పేర్లు గల్లంతు
- కనీస సౌకర్యాలకు దూరంగా కోట్లాది మంది విద్యార్థులు

న్యూఢిల్లీ : పిఎంశ్రీ (పిఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద బీహార్, నాగాలాండ్‌సహా మూడు రాష్ట్రాలకు ఒక్క రూపాయి నిధులైనా రాలేదు. ఈ పథకం కింద కేంద్రం తన వాటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాసహా 17 రాష్ట్రాలకు 25 శాతం మించి నిధులు అందించలేదు. దేశంలోని 14,500 పిఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యంత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో 2022 సెప్టెంబరులో కేంద్ర క్యాబినెట్ ఈ పథకానికి ఆమోదముద్ర వేసింది. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు సహా ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో ఉన్న పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేసుకొని వాటిలో మౌలిక సదుపాయాలను, సాంకేతికతను, ఉపాధ్యాయ శిక్షణను, బోధనా పద్ధతులను మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి కేటాయించిన బడ్జెట్‌లో కేవలం 35 శాతాన్నే ఖర్చు చేశారు.

సగ కాలం పూర్తయినా...

పిఎంశ్రీ పథకం కింద నిధుల వినియోగం చాలా పేలవంగా ఉన్నదని గత నెలలో రాజ్యసభకు సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తేల్చి చెప్పింది. అరకొర నిధుల కారణంగా పాఠశాలల్లో విద్యా సంబంధమైన సూచికల విషయంలో గుణాత్మక మార్పులేవీ రాలేదని విద్యావేత్తలు పెదవి విరిచారు. పిఎం శ్రీ పథకాన్ని 2022–23 నుంచి 2026–27 వరకూ ఐదు సంవత్సరాల పాటు అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.27,360 కోట్లు కాగా, కేంద్రం రూ.18,128 కోట్లు, రాష్ట్రాలు రూ.9,232 కోట్లు భరించాల్సి ఉంటుంది. నిర్దేశించుకున్న ఐదేళ్లలో ఇప్పటికే సగం కాలం పూర్తయినప్పటికీ కేంద్రం ఈ పథకానికి కేటాయించిన మొత్తంలో మూడో వంతు మాత్రమే ఖర్చు చేసింది.

రాష్ట్రాల వారీగా...

వాస్తవానికి ఈ పథకానికి ఖర్చు చేసిన నిధులు చాలా తక్కువ. ఈ పథకానికి 2023–24లో రూ.4,000 కోట్లు, 2024–25లో రూ.6,050 కోట్లు అందించినప్పటికీ అందులో చేసిన ఖర్చు 30 శాతం మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.7,500 కోట్లు కేటాయించారు. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ పథకంలో చేరాయి. గత ఆర్థిక సంవత్సరంలో బీహార్‌కు కేంద్ర వాటాగా రూ.360 కోట్లు రావాల్సి ఉన్నప్పటికీ ఒక్క పైసా కూడా చేరలేదు. నాగాలాండ్, లక్షద్వీప్‌లదీ అదే పరిస్థితి. ఛత్తీస్‌గఢ్‌కు వచ్చిన నిధులు 6.6 శాతం మాత్రమే. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక వంటి అధిక జన సాంద్రత కలిగిన రాష్ట్రాలు సహా మొత్తం 17 రాష్ట్రాలకు కేంద్ర వాటాలో 25 శాతం మించి రాలేదు. కేంద్ర వాటాలో అత్యధిక నిధులు పొందిన రాష్ట్రంగా మధ్యప్రదేశ్ (52.2 శాతం), ఆ తరువాత స్థానంలో 41.3 శాతం నిధులతో గుజరాత్ ఉన్నాయి.



మంచి పనితీరు కనబరుస్తున్నా...

ఎంపిక చేసిన పాఠశాలల్లో గ్రంథాలయాలు, స్మార్ట్ క్లాస్‌రూములు, సమీకృత సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం, ప్రతి సబ్జెక్టుకు అనుభవజ్ఞుడైన అధ్యాపకుడు... ఇలాంటి సదుపాయాలను కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. కేంద్రం నుంచి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం కారణంగా లక్ష్యం దెబ్బతింటోంది. 2021–22 సంవత్సరపు యుడిఐఎస్‌ఇ నివేదిక ప్రకారం 1.17 లక్షల పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నెట్టుకొస్తున్నాయి. ఉపాధ్యాయ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్న రాష్ట్రాలలో బీహార్ ఒకటి. కేంద్రీయ విద్యాలయాలు (కెవిఎస్), నవోదయ విద్యాలయాలు (ఎన్‌విఎస్), సైనిక పాఠశాలలు ఇప్పటికే మంచి పనితీరును కనబరుస్తున్నాయి. ఇలాంటి వాటిని పిఎంశ్రీలో చేర్చడంతో అనేక ఇతర పాఠశాలలకు అభివృద్ధి చెందే అవకాశం లేకుండా పోతోంది. పాఠశాల విద్యా శాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో 29 శాతం కెవిఎస్, ఎన్‌విఎస్, పిఎంశ్రీకి కేటాయించారు. వీటిలో చదువుకుంటున్న మొత్తం విద్యార్థుల సంఖ్య 20లక్షలు మాత్రమే. మిగిలిన 11.6 లక్షల పాఠశాలల్లో 15.6 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారు. వీటికి కేటాయించిన బడ్జెట్ 51శాతం. ఇది కూడా గత కొన్ని సంవత్సరాలుగా తగ్గిపోతోంది.

పథకంలో చేరనందుకు శిక్ష

పాఠశాల విద్యా శాఖకు చెందిన నిధుల కేటాయింపులో సమతుల్యత కన్పించడం లేదు. ఫలితంగా చాలా కొద్ది పాఠశాలల్లోనే మంచి సౌకర్యాలు ఉన్నాయి. అనేక పాఠశాలలు సౌకర్యాల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. బిజెపియేతర పాలిత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఈ పథకంలో చేరలేదు. వీటికి సమగ్ర శిక్షా అభియాన్ కింద కూడా నిధులు అందలేదు. పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ కింద చేపట్టిన వివిధ కేంద్ర పథకాలకు రూ.57,400 కోట్లు కేటాయించారు. వీటిలో సమగ్ర శిక్షా అభియాన్, న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్, స్టార్స్, పిఎం శ్రీ ఉన్నాయి. 2024–25లో ఈ పథకాలకు రూ.52,400 కోట్లు కేటాయించినా, ఖర్చు చేసింది రూ.29,240 కోట్లే. ద్రవ్య నిర్వహణ, కేటాయించిన నిధులను సైతం ఖర్చు చేయకపోవడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ ఆయా పథకాలకు నిధుల కేటాయింపులు పెంచుతున్నా, వాస్తవ వ్యయం తగ్గిపోతోంది.

ఏ మూలకూ చాలని నిధులు

కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయించింది రెండున్నర శాతం కంటే కొంచెం ఎక్కువ మాత్రమే. జాతీయ విద్యా విధానం–2020 అమలుకు అవసరమైన నిధులను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత కేటాయింపులు సరిపోవని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. 2021–22లో స్థూల దేశీయోత్పత్తిలో విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వ్యయం 4.12 శాతం. జాతీయ విద్యా విధానం ఈ వ్యయం ఆరు శాతంగా ఉండాలని సూచించింది. 1968లో కొఠారీ కమిషన్ కూడా ఇదే సూచన చేసింది. వాస్తవానికి పెరుగుతున్న ధరలను బట్టి చూస్తే ఈ వ్యయం జిడిపిలో 10 శాతమైనా ఉండాలి. భూటాన్, మాల్దీవులు వంటి సార్క్ దేశాలు విద్యపై ఎక్కువగానే ఖర్చు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో కేంద్రం సకాలంలో రాష్ట్రాలకు నిధులను విడుదల చేయడంతో పాటు వాటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

బిజెడి అధ్యక్షుడిగా నవీన్ పట్నాయక్

- బిజెపి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

భువనేశ్వర్ : బిజూ జనతాదళ్ (బిజెడి) అధ్యక్షుడిగా ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరుసగా తొమ్మిదవసారి ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.కె దేబ్ ప్రకటించారు. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో పార్టీ ఓటమి పాలైందని చెప్పారు. బిజెపి చేసిన తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పార్టీ సోషల్ మీడియాను మెరుగుపరచుకోవాలని, టెక్నాలజీ సహాయంతో ప్రజలకు నిజం చెప్పాలని ఆయన అన్నారు. తన తండ్రి బిజు పట్నాయక్ భావజాలం బిజెడికి మార్గదర్శక సూత్రంగా కొనసాగుతోందని అన్నారు.

సుప్రీంకోర్టుకు ఆ అధికారం ఉంది

మొదటి పేజీ తరువాయి

అధికారం సుప్రీం కోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులకు వున్నప్పుడు, రాష్ట్రపతి, గవర్నర్లు వంటి రాజ్యాంగ బద్ధ కార్యనిర్వాహకులకు కూడా విధులను నిర్వర్తించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసే అధికారం వుంటుందని తెలిపారు. పదవీ విరమణ చేసిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిటి సెల్వమ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చలమేశ్వర్ ఈ వ్యాఖ్యలు చేశారు. గవర్నర్లు నివేదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రపతికి మూడు మాసాల గడువు నిర్దేశిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై జాస్తి చలమేశ్వర్ స్పందిస్తూ..'మీరు, నేను న్యాయమూర్తులుగా, పార్లమెంట్ చేసిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించగలుగుతున్నట్లయితే, ప్రభుత్వ విధిని నిర్వహించాల్సిందిగా ప్రభుత్వ హోదాలో వున్న వారిని ఆదేశించే అధికారం వారికి లేదని విశ్వసించడం నా వరకు రాజ్యాంగపరంగా సందేహాస్పదంగా వుంటుంది. ఎందుకంటే నేను ఆ సిద్ధాంతానికి మద్దతునివ్వను.' అని పేర్కొన్నారు.

అంతకుముందు చలమేశ్వర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, దేశంలో రాజ్యాంగంలో అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దీన్ని ఒక వేడుకలా జరుపుకునే కన్నా దీనిపై ఆత్మపరిశీలన చేసుకునేందుకు అవకాశంగా తీసుకోవాలని అన్నారు. గత 75ఏళ్లలో వందకు పైగా సవరణలు రాజ్యాంగానికి చేయబడ్డాయన్నారు. ఎన్నికల్లో గెలుపొందడానికి అభ్యర్థులు పెద్ద మొత్తాల్లో డబ్బు ఖర్చు చేయడం, న్యాయ వ్యవస్థకు అరకొరగా వున్న బడ్జెట్ కేటాయింపులు జరపడం వల్ల పెరిగిపోతున్న ఎరియర్లు ఆందోళన కలిగించే అంశాలుగా వున్నాయన్నారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జిఆర్ స్వామినాథన్ సహా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తీరు మారని అమెరికా!

- 18వ శతాబ్దం నాటి చట్ట పునరుద్ధరణకు యత్నాలు
- వెనిజులా ప్రజల నిరసన

కారకాస్ : అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వారి పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారతీయుల చేతులకు కాళ్లకు సంకెళ్లు వేసి ఖైదీలు మాదిరిగా వారిని యుద్ధ విమానంలో స్వదేశానికి పంపారు. ఈ విధమైన చర్యనే వెనిజులన్లపై కూడా అమెరికా చేపట్టింది. సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వెనిజులన్లను మెడలు వంచి సంకెళ్లు వేసి, మరీ స్వదేశానికి పంపారు. ట్రంప్ చర్యలపై వెనిజులా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 18వ శతాబ్దం నాటి ఎలియన్ ఎనిమీస్ (విదేశీ శత్రువుల చట్టం) చట్టాన్ని అమలుచేస్తూ వందలాదిమంది వెనిజులన్లకు చట్టపరమైన రక్షణ లేకుండా బహిష్కరిస్తోందని విమర్శించారు. ట్రంప్ చర్యలకు వ్యతిరేకంగా వెనిజులా ప్రజలు ఆందోళనకు దిగారు. శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ చర్యలను పౌర హక్కుల సంఘాలు కూడా విమర్శిస్తున్నాయి. ఎలియన్ ఎనిమీస్ యాక్ట్ 1798 (విదేశీ శత్రువుల చట్టం)ని పునరుద్ధరించాలని ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నాయి. ముందస్తు నోటిఫికేషన్ లేకుండా, న్యాయవాదుల సలహా తీసుకోకుండా వెనిజులన్లను బహిష్కరించడానికి ఈ చట్టాన్ని ఇలా అమలుచేయడం దారుణమని ఎసిఎల్‌యు (ది అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్)కు లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయి.



వెనిజులా కారకస్‌లో నిరసన తెలుపుతున్న అవమానకరంగా తిప్పిపంపిన వలసదారుల బంధువులు



నాలుగో సంపుటి ఆవిష్కరణలో కె.నారాయణ, వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, కూనంనేని సాంబశివరావు తదితరులు

సమకాలీన రాజకీయాలకు అద్దం రాఘవాచారి సంపాదకీయాలు

- నాలుగో సంపుటి ఆవిష్కరణలో సిపిఐ జాతీయకార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ :

సమకాలీన రాజకీయాలు, పరిస్థితులకు రాఘవాచారి సంపాదకీయాలు సాక్ష్యాలుగా నిలుస్తాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు చక్రవర్తుల రాఘవాచారి... జాతీయ అంశాలతో రాసిన సంపాదకీయాల నాలుగో సంపుటి పుస్తకావిష్కరణ సభ శనివారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. సి.రాఘవాచారి ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో కె.నారాయణ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... అనేక విషయాలపై లోతైన అవగాహన కలిగిన విజ్ఞాన గని రాఘవాచారి అని కొనియాడారు. సంపాదకీయం రాయడం అంత సులువు కాదన్నారు. ఆయన సంపాదకీయాలను సంపుటిలుగా తీసుకుస్తున్న రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలి రాఘవాచారి అని కొనియాడారు.

ఆయన సంపాదకీయాలు రిఫరెన్స్‌గా ఉపయోగపడతాయని తెలిపారు. అనేక అంశాలపై లోతైన విశ్లేషణలతో సంపాదకీయాలు రాశారని గుర్తుచేశారు. ప్రత్యర్థులు సైతం గౌరవించే వ్యక్తిత్వం గలవారన్నారు. అన్ని అంశాలపై అవగాహన గల వారు చాలా అరుదుగా ఉంటారని, వారిలో రాఘవాచారి ఒకరు అని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... రాఘవాచారి ఎంతో స్నేహశీలి అని, ఎంతపెద్ద విషయాన్నైనా సులభంగా చెప్పే తత్వం ఆయనదన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రాఘవాచారి వద్ద తాను శిష్యరికం చేశానని చెప్పారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని, మేథోసంపత్తిని ప్రశంసించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ... విశాలాంధ్రకు రాఘవాచారిని కిరీటంగా అభివర్ణించారు. ముందుగా ఈ సంపుటిని దారిదీపం సంపాదకులు డివివిఎస్ వర్మ పరిచయం చేశారు. రాఘవాచారి సంపాదకీయాల క్యూఆర్ కోడ్‌ను విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు ఆవిష్కరించారు.

ట్రస్ట్ సభ్యుడు బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్, సిపిఐ ఎన్‌టిఆర్, విజయవాడ నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, డాక్టర్ సురేశ్, రాఘవాచారి సతీమణి, ట్రస్ట్ చైర్మన్ కనపర్తి జోత్స్న, కుమార్తె డాక్టర్ అనుపమ ప్రసంగించారు. తొలుత ఎపిపిఎన్ఎం కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు.

విద్వేష నేరాల బాధితులకు ఒకే రీతిలో నష్టపరిహారం

- 23న విచారించనున్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : విద్వేష నేరాలు, అల్లరి మూకల హత్యాకాండలో బాధితులకు నష్టపరిహారాన్ని మంజూరు చేయడంలో ఏకరూపత (యూనిఫార్మిటీ) వుండాలని కోరుతున్న పిటిషన్‌పై ఈ నెల 23న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. ఇండియన్ ముస్లిం ఫర్ ప్రొగ్రెస్ అండ్ రిఫార్మ్ (ఐఎంపిఎఆర్) దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తమ స్పందనలు తెలియచేయాల్సిందిగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు 2023 ఏప్రిల్‌లోనే కోరింది. తెహసిన్ పూనావాలా కేసులో 2018లో తాము ఇచ్చిన ఆదేశాల మేరకు, మూక దాడుల బాధిత కుటుంబాలకు సహాయం అందించడానికి ఒక పథకాన్ని రూపొందించేందుకు తీసుకున్న చర్యలను తెలియచేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. ఈ అంశంపై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మసిహ్‌లతో కూడిన బెంచ్ విచారణ జరపనుంది.

ఉద్యోగాల భర్తీలో స్పోర్ట్స్ కోటా 3 శాతానికి పెంపు

మొదటి పేజీ తరువాయి

వివరాలను నింపాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను స్క్రీనింగ్ కమిటీ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా శాప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఎఒ) ఉంటారు. ఈ కమిటీ 30 రోజుల్లో మెరిట్ జాబితాను సిద్ధం చేసి రాష్ట్రస్థాయి కమిటీకి వెంటనే అందించాలి. యువజన, సర్వీసులు, స్పోర్ట్స్ శాఖ ప్రత్యేక ప్రధాన/ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీకి శాప్ ఎమ్‌డి కన్వీనర్ మెంబర్‌గా ఉంటారు. ఇందులో సభ్యులుగా జిఎడి ప్రత్యేక ప్రధాన/ముఖ్యకార్యదర్శి, అదేవిధంగా సంబంధితశాఖ ప్రత్యేక ప్రధాన/ముఖ్యకార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ 15 రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలి. ఈ జిఒ విడుదల పట్ల శాప్ ఛైర్మన్ రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గదర్శకాలతో క్రీడాకారులకు గతం కంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

జెఇఇ మెయిన్ ఫలితాలు విడుదల

- 24 మంది అభ్యర్థులకు 100 స్కోర్
- టాపర్లలో ముగ్గురు తెలంగాణ, ఒకరు ఎపికి చెందిన వారే

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఇంజినీరింగ్ ఎంట్రన్స్ జెఇఇ (మెయిన్)లో 24 మంది అభ్యర్థులు 100 స్కోర్ సాధించారు. శనివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జెఇఇ మెయిన్ ఫలితాలను విడుదల చేసింది. రాజస్థాన్ నుంచి ఏడుగురు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర నుండి ముగ్గురు చొప్పున, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, గుజరాత్ నుండి ఇద్దరు చొప్పున, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు టాపర్లుగా నిలిచారు. టాపర్లలో ఇద్దరు విద్యార్థినులు ఉన్నారు. 21 మంది టాప్–స్కోరింగ్ అభ్యర్థులు జనరల్ కేటగిరి నుంచి వచ్చినప్పటికీ, జాబితాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి తరగతుల నుంచి వచ్చిన వారు ఒక్కొక్కరు ఉన్నారు.

కీలకమైన పరీక్షకు సంబంధించిన రెండో ఎడిషన్‌కు 9.92 లక్షల మంది, మొదటి ఎడిషన్‌లో 10.61 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పొందిన మార్కులను పరీక్షలు రాసిన వారు ప్రతి సెషన్‌కు 100 నుంచి 0 వరకు స్కేల్‌గా మారుస్తారని అధికారి తెలిపారు. జెఇఇ (మెయిన్) పేపర్ 1, పేపర్ 2 ఫలితాల ఆధారంగా అభ్యర్థులు జెఇఇ (అడ్వాన్స్‌డ్)కు హాజరు కావడానికి షార్ట్‌లిస్ట్ చేయబడతారని తెలిపారు. ఇది దేశంలోని 23 ప్రముఖ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షగా చెప్పొచ్చు. పరీక్షను తెలుగుసహా 13 భాషల్లో నిర్వహించారు. జెఇఇ (మెయిన్) రెండో ఎడిషన్ 300 నగరాల్లోని 531 ప్రత్యేక పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. వీటిలో ఇతర దేశాల్లో 15 మనామా (బహ్రెయిన్), దోహా సిటీ (ఖతార్), షార్జా, అబుదాబి, దుబాయ్ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), మస్కట్ (ఒమన్), రియాద్ (సౌదీ అరేబియా), సింగపూర్, కువైట్ సిటీ (కువైట్), కౌలాలంపూర్ (మలేషియా), ఖాట్మండు (నేపాల్), వెస్ట్ జావా (ఇండోనేషియా), వాషింగ్టన్ (యుఎస్), లాగోస్ (నైజీరియా), మ్యూనిచ్ (జర్మనీ) ఉన్నాయి.

మొదటి ఎడిషన్‌లో 39 మంది, రెండో ఎడిషన్‌లో 110 మంది అభ్యర్థుల ఎన్‌టిఎ స్కోర్‌లను ప్రకటించలేదు. వారు అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వారి ఫలితాలు ప్రకటించలేదు. 'ఈ అభ్యర్థులతో పాటు 23 మంది అభ్యర్థుల ఫొటోలు, బయోమెట్రిక్ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారంలో వ్యత్యాసాల కారణంగా వారి ఫలితాలను నిలిపివేశారు. ఈ అభ్యర్థులు తమ ఫలితాలను ప్రకటించడానికి నిర్ణీత తేదీలోపు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించబడిన ఫొటోలను ఎన్‌టిఎకి అందించాలి' అని ఎన్‌టిఎ సీనియర్ అధికారి తెలిపారు.

కెనడాలో భారతీయ విద్యార్థిని హత్య



కెనడా : కెనడాలో భారతీయులు వరుసగా హత్యకు గురవుతున్నారు. ఒట్టావా సమీపంలోని రాక్‌లాండ్ ప్రాంతంలో ఓ భారతీయుడు కత్తిపోట్లకు గురై మరణించిన విషయం మరువక ముందే మరో భారతీయురాలు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. భారత కాన్సులేట్ తెలిపిన వివరాల ప్రకారం.. హమిల్టన్ కాలేజీలో చదువుతున్న హర్‌సిమ్రత్ రంధవా (21) బస్టాప్ వద్ద వేచి ఉండగా.. రెండు కార్లలో వచ్చిన ఇద్దరు దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు. ఓ బుల్లెట్ తగలడంతో తీవ్రంగా గాయపడిన హర్‌సిమ్రత్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హర్‌సిమ్రత్ మృతిపై భారత కాన్సులేట్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మృతురాలి కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

ఉక్రెయిన్‌లో తాత్కాలిక కాల్పుల విరమణ

- ఈస్టర్ సందర్భంగా పుతిన్ ప్రకటన

మాస్కో : ఈస్టర్ సందర్భంగా ఉక్రెయిన్‌లో తాత్కాలికంగా కాల్పుల విరమణను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శనివారం ప్రకటించారు. మాస్కో కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 6గంటల నుండి ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ కాల్పుల విరమణ అమల్లో వుంటుందని తెలిపారు. ఈ సమయంలో అన్ని సైనిక కార్యకలాపాలు నిలిపివేయబడతాయని ప్రకటించారు. చీఫ్ ఆఫ్ ది జనరల్ స్టాఫ్ వాలెరి గ్రెసిమొవ్‌తో జరిగిన సమావేశంలో పుతిన్ ఈ ప్రకటన చేశారు. ఉక్రెయిన్ కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తుందని భావిస్తున్నట్లు పుతిన్ పేర్కొన్నారు.

గాజాలో ఆగని దాడులు !

- గత 48గంటల్లో 90మందికి పైగా మృతి

దేర్ ఎల్ బాలాహ్ : గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ కొనసాగుతునే వుంది. గత 48 గంటల్లో 90మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు శనివారం తెలిపాయి. వీరిలో మహిళలు, పిల్లలే అధిక సంఖ్యలో ఉన్నారు. మానవతా జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న వారు కూడా మరణించిన వారిలో వున్నారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఖాన్‌యూనిస్ నగరంలో 11మంది మరణించారు. వీరిలో చాలా మంది అల్ మావసి ఏరియాలో వేసిన శిబిరంలో తల దాచుకున్నవారే. రఫా నగరంలో వేర్వేరుగా జరిగిన దాడుల్లో నలుగురు మరణించారు. గత రాత్రి జరిగిన వైమానిక దాడుల్లో 15మంది ప్రాణాలు కోల్పోయారు. గాజావ్యాప్తంగా దాడులను ఉధృతం చేస్తామని హెచ్చరించిన ఇజ్రాయిల్ ఇప్పటికే పలు భద్రతా జోన్‌లను ఆక్రమించింది. గత ఆరు వారాలుగా గాజాలోకి ఆహారం, ఇతర నిత్యావసరాలు రాకుండా అడ్డుకుంటోంది. దీంతో అక్కడ పరిస్థితులు అత్యంత దుర్భరంగా వున్నాయి. వేలాదిమంది పిల్లలు పోషకాహార లోపం బారిన పడ్డారని సహాయక సంస్థలు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



పరిస్థితులను అదుపులోకి తీసుకురావాలని అమెరికా కొత్త రాయబారికి ఐరాస విజ్ఞప్తి

ఆహార నిల్వలు తరిగిపోతుండడంతో రోజుకు ఒకసారి భోజనం చేయడం కూడా కష్టంగా మారిందని ఐక్యరాజ్య సమితి విచారం వ్యక్తం చేసింది. గాజాలో విధించిన ఆహార దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేసేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా ఇజ్రాయిల్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి మైక్ హకాబిని ప్రపంచ ఆరోగ్య సంస్థ తూర్పు మధ్యధరా ప్రాంత డైరెక్టర్ హనన్ బాల్కీ కోరారు. హకాబి తక్షణమే అక్కడకు వెళ్లి పరిస్థితులను అదుపులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 51వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. 90శాతానికి పైగా జనాభా నిర్వాసితులయ్యారు. వేలాదిమంది తాత్కాలిక శిబిరాల్లో నివసిస్తున్నారు. విస్తృతంగా జరుగుతున్న దాడులతో గాజాలో మౌలిక వసతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

40 Years of Excellence 1986-2025 | Infinity Learn by Sri Chaitanya

JEE MAIN 2025 Results

JEE లో కష్టమైన మ్యాథ్స్, క్లిష్టమైన కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లను

శ్రీచైతన్య అకడమిక్ ప్రోగ్రామ్‌లతో సులువుగా అధిగమించవచ్చని

శ్రీచైతన్య ఏపి రెసిడెన్షియల్ క్యాంపస్‌ల విద్యార్థులు నిరూపించారు



JEE MAIN టాప్ ర్యాంకర్స్‌ను అభినందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మశ్రీ గారు, శ్రీచైతన్య టెక్నోస్కూల్స్ డైరెక్టర్ శ్రీమతి సీమ గారు

వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం రెసిడెన్షియల్ క్యాంపస్‌లు

ALL-INDIA ALL CATEGORY RANKS BELOW TOP 10

RANK	Name	Appl No
1	VANGALA AJAY REDDY	250310255592@
2	THANDU YOGITHAA	250310612207%
3	BANDARI RUSHMITH	250310395238$
4	V ESWAR KARTHIK	250310236425@
5	K MUNI SAI YADAV	250310488636$
6	B VIKRAM RAJA	250310322700$
7	SHAGANTI THRISHUL	250310500008$
8	LAXIBHARGAV MENDE	250310248080$
9	D CHETAN RAO	250310635984$
10	P H SAI SURYA KARTHIK	250310407861$

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 1000లోపు ర్యాంకులు

RANK	Name	APPL. NO.
107	MAULIK JAIN	250310146708*
121	T VARDHAN COWDARY	250310281709
127	A RAVIKIRAN	250310862066
129	B V MANI PREETHAM	250310354575
130	VANKA SAI SRI RAM SATVIK	250310255926
131	PABBATI PRANAY REDDY	250310729238
132	AARIT PANDA	250310397956
138	D G S DHARMA PRATAP	250310347994
141	ARNAV SHARMA	250310230909
144	PUTTA GURU HARSHITH	250310747804
176	BALABADRULA ARYAN	250310555612
188	ATHARVA VINAY MHATRE	250310419742
198	SOURISH SRIVASTAVA	250310144666*
204	KAKUMANU VENEETH	250310408990
206	K CHENNA KESHAVA	250310413525
212	RONGALI KARTHEEK	250310298024
214	VIVAAN	250310795991
219	V GEETHAM KUMAR NAIDU	250310712535
224	D G S ARUNACHALAM	250310496782
230	P JASWANTH REDDY	250310327630
239	K A RISHITHA REDDY	250310508047
240	EIVAKSH AGGARWAL	250310148794
241	BURRI RISHIK KUMAR	250310671146
243	SHREYAS S	250310485787
245	D NUTHAN REDDY	250310237342
255	BANDARU ROHITH DATTA	250310254979
262	M V GANESH ROYAL	250310388032
265	PIYUSH PANDA	250310029401
272	KURUVELLA HARSHITH	250310252682
273	UPPULA BHAVAPRITA	250310107999
278	KOLA PRAVEEN KUMAR	250310779830
282	V H VARDHAN REDDY	250310255255
285	MADU MANMOHITH REDDY	250310154511
285	N HEMANTH ABHIRAM	250310499764
292	KALLURI SRI RAGHAVA	250310240010
294	D GNANA RUTVIK SAI	250310156772
309	SARATH CHANDAR M	250310329395
319	S GEETHA SRI KOUMUDI	250310775014
330	MOHITH LAKSHMANA	250310282416
334	ADEEB ALI ISLAM	250310004843
345	LAKKIREDDY CHERVITHA	250310748513
345	Y JASWANTH CHOWDARY	250310295979
350	NALAMARA SREE VATSAV	250310941139
356	PALURI BHARATH REDDY	250310427059
364	P PVT ABHI RAM	250310696150
371	ADVAY MAYANK	250310057845*
378	G H SAI RAM BALAJI	250310477250
380	SAKHINANA HARICHARAN	250310787260
398	EGA YASWANTH REDDY	250311118436
400	GYAN PRAKASH	250310498076
414	SK MOHAMMED SAMEER	250310301234
421	SWARIT SUBHAM	250310160758
422	KORIKANA RASAGNYA	250310669659
427	P BHANU PRAKASH REDDY	250310425383
436	DUARY ANISH	250310677401
456	KRISHNA SRIPAD K	250310481851
457	D SRUJAN HASITH REDDY	250310496816
459	BUDUMU MAHANTH	250310672360
462	A SRI PRANEETH REDDY	250310733055
462	TANAV GUPTA	250310031836
469	ARNAV KRISHNA	250310172782
477	GAUTHAM POCHA	250310446545
493	GALI PRATHYUSHA	250310441423
496	P BHAVYA	250310357094
505	DAKSH TIWARI	250310597177
522	VALLABHANENI REVANTH	250310600382
523	M MANIDEEP VARMA	250310297384
529	C C S G VARUN YADAV	250310254274
531	M LAKSHMI PRASANNA	250310628019
540	PARIMALA LAKSHMI LASYA	250310630103
544	NALLA SAANVI SAI VEERA	250310342814
546	P ABHINOW REDDY	250310972579
607	BELLAMKONDA SARVAJITH	250310505341
615	RUDRA BHOR	250310720008
630	MACHUPALLI BHAVYA	250310084403
649	TANMAY GARG	250310572682
665	SUDARSHAN	250310322154
669	DAKKA VASU TEJA	250310625015
683	P SRUJAN KUMAR	250310688195
708	S PRANEETH SAI BHARATH	250310350016
725	M PAVAN KUMAR NAIDU	250310343986
728	SASANAPURI NIRNITH	250310344311
751	AYUSHI VATS	250310249038
759	KUSHAGRA SINHA	250310248830
769	D BALARAM NAIDU	250310684120
776	KRISHNA BANSAL	250310038184
812	B YOGA SAI SRINIVAS	250310726239
817	GOWNI GOWNITH REDDY	250310642703
833	G MAHANT	250310549555
834	HET SACHIN SHETH	250310587285*
843	SIDDHARTHA CH V S	250310207787
853	JAGANA YOGESWAR	250310304381
856	ALAPARTHI JAHNAVI	250310383028
876	GANGADA RAJESH KUMAR	250310506153
909	R SAI KIRAN	250310351402
922	KSHITIJS DEEPAK	250310127223
923	ASHUTOSH PANDEY	250310291798
931	ANANYA TRIPATHI	250310226252
932	GUNTURU ROHIT PAWAN	250310777503
934	LOLUGU KARTHIKEYA	250310131231
948	ADAPA ASHOK SWAMY	250310570525
959	M NHAREN	250310236535
997	V V RITESH PRATHIPATI	250310245004

స్థలాభావం వల్ల అన్ని ర్యాంకులు ప్రకటించలేకపోతున్నాము

IIT-JEE & NEET LONG-TERM 2026

ADMISSIONS OPEN FOR NEET : 040 66 06 06 06

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Scan the QR code for offer on JEE Courses

FOR JEE MAIN & ADVANCED

HYDERABAD
NARSINGI - 91774 22235, 91777 36808 (BOYS)
MADHAPUR - AKSHARA LT - 89777 14781
KONDAPUR - GIRLS - 91770 46533, 91000 91871

VIJAYAWADA
GUDAVALLI - RAMAN BHAVAN-01: 97040 65666 9701911666
GAYATHRI CAMPUS DAYS: 96763 98777, 91775 50944

VISAKHAPATNAM
ASILMETTA - RAMAN BHAVAN-2: 91772 06961, 91776 39378
PEDDIPALEM – RAMAN BHAVAN BOYS RESIDENTIAL: 97058 30168, 91775 32995
BOYAPALEM – RAMAN BHAVAN GIRLS RESIDENTIAL: 94940 12024, 91772 01369

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback *DLP

@ EWS | % OBC NCL PWBD | $ OBC

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68